# హిండెన్‌బర్గ్ ఆరోపణలపై సుప్రీం కోర్టులో పిటిషన్..!

ఢిల్లీ: హిండెన్‌బర్గ్ ఆరోణలపై తాజాగా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు అయింది. పిటిషన్‌ను నమోదు చేయడానికి సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ నిరాకరించినట్లు పిటిషనర్ ఫిర్యాదు చేశారు. పిటిషన్ దరఖాస్తులను నమోదు చేయమని రిజిస్ట్రీని ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరారు. అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీలకు వ్యతిరేకంగా %ఖూ% షార్ట్-సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన మోసం ఆరోపణలను పరిష్కరించడానికి తీసుకున్న చర్యపై సెబీ నుంచి స్టేటస్ రిపోర్ట్ కోరిన దరఖాస్తును జాబితా చేయడానికి కోర్టు రిజిస్ట్రీ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు ఓ లాయర్. న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన అప్పీల్‌లో జనవరి 3న నాటి ఆదేశాలలో సుప్రీం కోర్టు తన విచారణను పూర్తి చేయడానికి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి)కి మూడు నెలల గడువు ఇచ్చింది. ఆ క్రమంలో అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ చేసిన స్టాక్ మానిప్యులేషన్ ఆరోపణలపై జోక్యం చేసుకోవడానికి లేదా తదుపరి చర్యలకు ఆదేశించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వివాదంపై వార్తాపత్రికల నివేదికల ద్వారా వెళ్లలేమని లేదా నిపుణుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోలేమని అత్యున్నత న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. అయితే ఈ విషయంలో ఏదైనా తదుపరి చర్య అవసరమా లేదా అని సెబీకే వదిలి వేసింది. ఈ విచారణను ఈ కాలక్రమంలో "ప్రాధాన్యంగా" పూర్తి చేయాలని కోర్టు ఆదేశించాలని తివారీ కోరారు. జూన్ 3న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారంలో సెబీ దర్యాప్తు ని వేదికను సమర్పించింది. భారతీయ సెక్యూరిటీల మార్కెట్ పటిష్టతను మెరుగుపరిచేందుకు కోర్టు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకున్నారా లేదా అనే అంశంపై కేంద్ర ప్రభుత్వంతో పాటు సెబీ కూడా స్టేటస్ రిపోర్టును సమర్పించింది. లోక్‌సభ 2024 ఫలితాల తర్వాత షేర్ మార్కెట్ పతనం, పెట్టుబడిదారుల నష్టంపై కేంద్ర ప్రభుత్వం సెబీ వివరణాత్మక నివేదికను దాఖలు చేయాలని తివారీ కోరారు. అయితే, ఆగస్ట్ 5న, కోర్ట్ రిజిస్ట్రార్ దరఖాస్తును "పూర్తిగాజిస్ట్రార్ దరఖాస్తు తప్పుగా భావించారు" అని ఎటువంటి సహేతుకమైన కారణాన్ని వెల్లడించలేదని పేర్కొంటూ సుప్రీం కోర్టుకు వెళ్లారు. తివారీ వైఖరికి విరుద్ధంగా సెబీ దర్యా ప్తునకు కోర్టు ఎలాంటి గడువు విధిం చలేదని రిజిస్ట్రార్ వాదించారు. అదానీ గ్రూప్‌కు వ్యతిరేకంగా 2023 హిండెన్‌బర్గ్ నివేదిక ప్రచురించిన తర్వాత నష్టాలను చవిచూసిన ప్రజలకు, పెటు ్టబడిదారులకు సెబీ దర్యాప్తు ముగింపులు ఏమిటో తెలుసుకోవడం చాలా ముఖ్యం అని తివారీ పేర్కొన్నారు.

# గ్రీన్ ఎనర్జీ కోసం పన్ను రాబడి ముఖ్యం

మొదటి పేజి తరువాయి

గ్రీన్ పవర్ కోసం వివిధ ఆవిష్కరణలకు సంబంధించి గ్లోబల్ ఫండ్స్ అందుబాటులో లేనప్పుడు పన్ను రాబడి ద్వారా వచ్చే నిధులు ఈ రంగానికి ఉపయోగపడుతాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆగస్టు 13 న చెప్పారు. భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో మాట్లాడిన ఆమె, పన్నులను సున్నాకు తీసుకురావాలని నేను కోరుకుంటున్నాను, కానీ దేశం ముందున్న సవాళ్ల కారణంగా భారతదేశ పన్నులను శూన్యంగా చేయలేమని ఆమె అన్నారు. భారత్ స్వంత నిధులతో శిలాజ ఇంధనం నుండి పునరుత్పాదక శక్తికి మారడానికి ముందుకు సాగుతుంది. ఈ దిశగానే భారీగా పెట్టుబడులు పెడుతోంది. దీనికోసం ప్రపంచ నిధులకు వేచి ఉండలేము. పునరుత్పాదక శక్తి పరివర్తన స్థిరంగా ఉండాలంటే, వినూత్న పరిష్కారాలు అవసరం. పన్నుల ద్వారా వచ్చే డబ్బును పరిశోధనలకు నిధులు సమకూర్చేందుకు చాలా ముఖ్యం అని నిర్మలా చెప్పారు. గ్రీన్ ఎనర్జీ కోసం ఇంధన నిల్వలో అగ్రగామిగా ఉండాలి. సౌరశక్తిని నిల్వ చేసుకునే సామర్థ్యం మనకు లేదు. దీనిని నిల్వ చేయడానికి బ్యాటరీ సామర్థ్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది, బ్యాటరీ నిల్వలో భారతదేశం ముందంజలో నిలిచే వరకు, దేశం బొగ్గు, ముడి చమురు వంటి శిలాజ ఇంధనాలపై ఆధారపడి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి మాట్లాడుతూ, 2024 మార్చిలో, ఎఐ సామర్థ్యాలను అభివృద్ధి చేయడానికి రూ.10,300 కోట్ల కంటే ఎక్కువ కేటాయింపులను కేబినెట్ ఆమోదించిందని చెప్పారు. అంతేకాకుండా, సెమీకండక్టర్ చిప్‌ల అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ కోసం భారతదేశం మూడు యూనిట్లను ఏర్పాటు చేసినట్లు సీతారామన్ తెలిపారు.

# 2036 నాటికి 152 కోట్లు దాటనున్న జనాభా-పెరగనున్న మహిళలు

మొదటి పేజి తరువాయి

భారత్ మరిన్ని రికార్డులు బద్దలు కొట్టే దిశగా సాగుతోంది. ఇప్పటికే 144 కోట్ల జనాభాతో టాప్ లో ఉన్న భారత్.. వచ్చే పుష్కర కాలంలో ఏ మేరకు జనాభాను పెంచుకోబోతందన్న అంశంపై కేంద్రం తాజా అంచనాలు విడుదల చేసింది. దీని ప్రకారం భారత్ 2036 నాటికి 152 కోట్ల జనాభాను దాటేస్తుందని అంచనా వేసింది. అలాగే మహిళల వృద్ధి రేటు కూడా పెరకబోతోందని తెలిపింది. ఈ మేరకు కేంద్ర గణాంకాలు మరియు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ వివరాలు వెల్లడించింది. కేంద్ర గణాంకాలు మరియు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ దేశంలో జనాభా పెరుగుదలపై తాజా అంచనాలు వెల్లడించింది. ఇందులో 2036 నాటికి 152.2 కోట్లకు దేశ జనాభా చేరబోతోంది. అలాగే మహిళా జనాభా స్వల్పంగా పెరగనుంది. 2011లో మహిళా జనాభా దేశం మొత్తం జనాభాలో 48.5 శాతం ఉండగా.. అది 2036 నాటికి స్వల్పంగా పెరిగి 48.8 శాతానికి చేరనున్నట్లు తెలిపింది. అంటే ఓవరాల్ గా చూస్తే వచ్చే 12 ఏళ్లలో మహిళా జనాభా కేవలం 0.3 శాతమే పెరగనుంది. 2023లో మహిళలు మరియు పురుషులు పేరుతో వెలువరించిన ఈ నివేదికలో వచ్చే 12 ఏళ్లలో 15 ఏళ్ల లోపు జనాభా కూడా తగ్గనున్నట్లు తెలిసింది. జననాల వృద్ధి తగ్గడమే ఇందుకు కారణం. అలాగే 60 ఏళ్లకు పైగా వ్యక్తుల జనాభా పెరగనున్నట్లు తేలింది. 2036 నాటికి భారత్ లో మహిళా జనాభా పెరుగుదల వల్ల ప్రస్తుతం ఉన్న స్త్రీపురుషుల నిష్పత్తి 943 నుంచి 952కు చేరబోతోందని ఈ రిపోర్టు తెలిపింది. దీంతో స్త్రీ పురుషుల సమానత్వం దిశగా మరో అడుగు పడుతుందని అంచనా వేశారు.తద్వారా దేశంలో స్త్రీపురుష సమానత్వం కోసం ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు కొంతమేర ఫలితం ఇచ్చినట్లే భావిస్తున్నారు.

# భరతనాట్య ప్రదర్శనతో రికార్డులకెక్కిన చైనా బాలిక

ఢిల్లీ: పొరుగు దేశం చైనాలో మన సంప్రదాయ నృత్యానికి ఆదరణ పెరుగుతోంది. భరత నాట్యం నేర్చుకోవడానికి చైనా చిన్నారులు క్యూ కడుతున్నారు. తాజాగా బీజింగ్ లో చైనా బాలిక లియ్ ముజి (13) అరంగేట్రం ప్రదర్శన చేసింది. చైనాలో చైనా టీచర్ దగ్గర భరత నాట్యం నేర్చుకుని సోలోగా అరంగేట్రం చేసిన తొలి బాలికగా ముజి రికార్డు సృష్టించింది. చైనాలో భారత రాయబారి ప్రదీప్ రావత్ అర్ధాంగి శ్రుతి రావత్ చీఫ్ గెస్ట్ గా హాజరై బాలికను అభినందించారు. ఈ నెలాఖరులో ముజి చెన్నైలోనూ నాట్య ప్రదర్శన చేయనుందని బాలిక గురువు జిన్ షాన్ షాన్ చెప్పారు. గత పదేళ్లుగా ముజికి నాట్యం నేర్పిస్తున్నట్లు వివరించారు. భరత నాట్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు తొలిసారిగా గురువు, ఇతరుల ముందు ప్రదర్శన చేయడాన్ని అరంగేట్రంగా వ్యవహరిస్తారు. అరంగేట్రం పూర్తిచేసిన విద్యార్థి సొంతంగా ప్రదర్శనలు ఇవ్వడానికి, ఇతరులకు నాట్యం నేర్పడానికి గురువు అనుమతి లభిస్తుంది. లియ్ ముజి గురువు జిన్ షాన్ షాన్ భరత నాట్యంపై మక్కువతో చెన్నైకి వచ్చి నాట్యం నేర్చుకున్నారు. ఆపై 1999లో ఢిల్లీలో అరంగేట్రం చేశారు. ఆ తర్వాత చైనాకు వెళ్లి డ్యాన్స్ స్కూలు ఏర్పాటు చేసి చైనా చిన్నారులకు నాట్యం నేర్పిస్తున్నారు.

# వైద్యురాలిపై హత్యాచారం కేసు సీబీఐకి అప్పగింత...

మొదటి పేజి తరువాయి

కేసు విచారణను మూడు వారాల పాటు హైకోర్టు వాయిదా వేసింది. ఈ కేసు విచారణకు ఆదివారం వరకు కోల్‌కతా పోలీసులకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ డెడ్‌లైన్ విధించారు. అయితే దీదీ డెడ్‌లైన్ కంటే ముందే హైకోర్టు కేసు విచారణను సీబీఐకి అప్పగించింది. కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ ఆస్పత్రి ప్రిన్సిపల్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను వేరే మెడికల్ కాలేజ్ బదిలీ మీద పంపడం కాదు.. సెలవులపై వెళ్లాలని హైకోర్టు ఆదేశించింది. జూనియర్ డాక్టర్ హత్యను ఆస్పత్రి అధికారులు కప్పిపుచ్చే ప్రయత్నం చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. అతి దారుణంగా అత్యాచారం చేసి చంపేస్తే .. ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు తొలుత కుటుంబసభ్యులకు ఫోన్ వచ్చినట్టు తెలుస్తోంది. ఘటన జరిగిన ఉదయం నుంచి ఏం జరిగిందనే వివరాలను రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు సమర్పించింది. ఈ క్రమంలో ధర్మాసనం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. ప్రధాన న్యాయమూర్తి టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని డివిజన్ బెంచ్.. వైద్యురాలిపై అత్యాచారం, హత్య గురించి ఇప్పటివరకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రశ్నించింది. ఎక్కువ సమయం వృధా చేస్తే, ఎక్కువ ఆధారాలు మాయమవుతాయని.. ఈ కేసులో అన్ని పత్రాలను సీబీఐకి అందజేయాలని ఆదేశించింది. సీబీఐ వెంటనే ఈ దర్యాప్తును ప్రారంభిస్తుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు విచారణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ కేసు పత్రాలను ఇంటిలిజెన్స్ అధికారులు స్వయంగా సేకరించనున్నారు. నిందితుడు సంజయ్‌రాయ్ కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌ను అతి కిరాతకంగా రేప్ చేసి చంపేశాడు. హాస్పిటల్ సెమినార్ హాల్లో చదువుకుంటున్న లేడీ డాక్టర్‌ను పాశవికంగా అత్యాచారం చేసి అనంతరం దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటనపై డాక్టర్లు దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. ఎమర్జెన్సీ విధులను కూడా బహిష్కరించారు. ఢిల్లీ ఎయిమ్స్ , లక్నోలో వైద్యులు ఆందోళనలను మరింత తీవ్రతరం చేశారు. ..నల్లదుస్తులు ధరించి నిరసన తెలిపారు.

# వరల్డ్ క్లాస్ నగరంగా అమరావతి.. చంద్రబాబు దూకుడు!!

మొదటి పేజి తరువాయి

రాజధాని అమరావతిని ప్రపంచం గుర్తించే లెవల్ లో తీర్చి దిద్ది ఏపీకి పెట్టుబడులను ఆకర్షించాలనే ప్లాన్ లో ఉన్నారు సీఎం చంద్రబాబు, ఈ క్రమంలో రాజధాని అమరావతి నిర్మాణానికి శరవేగంగా అడుగులు వేస్తున్నారు.

చంద్రబాబుతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల భేటీ

ఈ క్రమంలో తాజాగా సీఎం నారా చంద్రబాబు నాయుడుతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు భేటీ అయ్యారు. నలుగురు సభ్యులతో కూడిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం గత రెండు రోజులుగా అమరావతిలో పర్యటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సచివాలయంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, సీఆర్డీయే కమిషనర్ కాటంనేని భాస్కర్ తో కలిసి వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు.

వరల్డ్ బ్యాంక్ ప్రతినిధుల మూడు రోజుల పర్యటన

ఈ బృందంలో వరల్డ్ బ్యాంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సీనియర్ స్పెషలిస్ట్ రఘు కేశవన్, లీడ్ ట్రాన్స్పోర్ట్ స్పెషలిస్ట్ గెరాల్డ్ పాల్ అలీవియర్,సీనియర్ అర్బన్ స్పెషలిస్ట్ కింగ్ యున్ షెన్, సౌత్



ఏషియా అర్బన్ ప్రాక్టీస్ మేనేజర్ అబేదాలిరజాక్ ఎఫ్.ఖలీల్ ఉన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా శనివారం విజయవాడకు వచ్చిన ప్రపంచ బ్యాంక్ బృందం మధ్యాహ్నం వరకూ విజయవాడ సీఆర్డీయే ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు.

రాజధాని అమరావతిలో పర్యటించిన వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు

సీఆర్డీయే గురించి అమరావతి ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి గురించి అధికారులు ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందానికి వివరించారు. శనివారం మధ్యాహ్నం అమరావతిలో క్షేత్ర స్థాయిలో పర్యటించి నిర్మాణంలో ఉన్న భవనాలను వారు పరిశీలించారు. రెండో రోజు ఆదివారం రాజధానిలోని రోడ్లను, కొండవీటి వాగు ఎత్తిపోతల పంప్ హౌస్ పనులను పరిశీలించడం తో పాటు విట్, ఎస్ఆర్ఎం, ఎయిమ్స్ లను పరిశీలించారు.

ప్రపంచ స్థాయి నగరంగా అమరావతి నిర్మాణ వివరాలు చెప్పిన చంద్రబాబు

సోమవారం సెక్రటేరియట్ లో సీఎం చంద్రబాబుతో వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి నిర్మాణంలో ఎలా ముందుకెళ్తుందనే దానిపై వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులకు సీఎం వివరించారు. ప్రపంచంలోని ఉత్తమ ప్రమాణాలు, ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని అమరావతి నిర్మాణం చేపడుతున్నట్లు సీఎం చంద్రబాబు వారికి వివరించారు.

**అమరావతికి అండగా ప్రపంచ బ్యాంకు**

చంద్రబాబు తో మాట్లాడిన అనంతరం ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం అమరావతికి అండగా ఉండేందుకు సానుకూలంగా ఉందని సీఆర్డీయే అధికారులు చెప్పారు. మరోమారు ప్రపంచ బ్యాంకు ఉన్నతాధికారుల బృందం మళ్ళీ మన రాష్ట్రానికి వస్తుందని, ఆ తర్వాతే రాబోయే రుణంపై స్పష్టత వస్తుందని అన్నారు.

# కేసీఆర్ కు బిగ్ షాక్ ప్లాన్ చేసిన రేవంత్ రెడ్డి!!

మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, నేతలు రోజుకు ఒక అంశం పైన రేవంత్ సర్కార్ ను టార్గెట్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ చేసిన తర్వాత ప్రజలు కాంగ్రెస్ పార్టీ పైన కాస్త సానుకూలత వచ్చింది.

రేవంత్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్న కేటీఆర్, హరీష్ రావులు

ఇక ఆ తర్వాత వరుసగా రేవంత్ రెడ్డి బృందం పెట్టుబడుల కోసం విదేశాలలో పర్యటించడం కూడా ఓ రకంగా తెలంగాణ రాష్ట్రానికి సానుకూల అంశమే. అయితే వీటి పైన ప్రజల ఫోకస్ పడకుండా రేవంత్ సర్కార్ ను తమదైన శైలిలో టార్గెట్ చేస్తున్నారు కేటీఆర్, హరీష్ రావులు. కేటీఆర్, హరీష్ రావు చేసే వ్యాఖ్యలను తిప్పి కొట్టడంలో రేవంత్ క్యాబినెట్ మంత్రులు ఫెయిల్ అవుతున్నారు.

బీఆర్ఎస్ కు చెక్ పెట్టేలా ప్లాన్ చేసిన రేవంత్

ఇక ఈ క్రమంలోనే రాష్ట్రంలో బీఆర్ఎస్ దూకుడుకు చెక్ పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లుగా దానికోసం ఒక ప్లాన్ కూడా రెడీ చేసినట్టుగా సమాచారం. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ కు తిరిగి వచ్చిన వెంటనే మరొకమారు కాంగ్రెస్ పార్టీలో చేరికలు ఉంటాయని, ఈ చేరికలతో బిఆర్ఎస్ నేతలకు షాక్ ఇవ్వాలని రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

కాంగ్రెస్ లో చేరనున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

ఇప్పటికే కాంగ్రెస్ కు దగ్గరగా ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంతనాలు జరుపుతున్నారని, రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ లో అడుగు పెట్టగానే వరుసగా ఎమ్మెల్యేల చేరికలు కాంగ్రెస్ పార్టీలో ఉంటాయని చెబుతున్నారు. గతంలో రేవంత్ రెడ్డి తో కలిసి పని చేసిన నాయకులు పార్టీ మారబోతున్నారని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పార్టీ మారే నాయకులతో ఇప్పటికే చర్చలు పూర్తయ్యాయని చెబుతున్నారు.

రేవంత్ హైదరాబాద్ రాగానే ప్లాన్ అమలు

ఇందులో ఒక మాజీ మంత్రి కూడా ఉన్నట్టుగా ప్రచారం జరుగుతున్న వేళ చివరి నిమిషం వరకు సస్పెన్షన్ కొనసాగించే అవకాశం ఉన్నట్టు సమాచారం. సీఎం రేవంత్ హైదరాబాద్ రాగానే రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చిన రేవంత్ రెడ్డిని అభినందిస్తూ వరుసగా హడావిడి చేయాలని ప్లాన్ చేసిన కాంగ్రెస్ నాయకులు ఇదే సమయంలో రేవంత్ ప్లాన్ లో భాగంగా బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్



ఇవ్వాలని కూడా నిర్ణయించినట్టు తెలుస్తుంది.

కేసీఆర్ కు చెక్ పెట్టనున్న రేవంత్

గ్రేటర్ హైదరాబాద్ నుండి ముగ్గురు ఎమ్మెల్యేలను రోజుకు ఒక్కొక్కరు చొప్పున పార్టీలో చేర్చుకోపోతున్నట్టు ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ లో చర్చ జరుగుతుంది. తమపై మాటల దాటిన పెంచిన బీఆర్ఎస్ నేతలకు, అధినేత కేసీఆర్ కు చెక్ పెట్టే బిగ్ ప్లాన్ లో రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మరి ఇది ఏ మేరకు వర్క్ అవుట్ అవుతుందో వేచి చూడాలి.

# ఏపీలో చర్చ మొదలైంది

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వంపై వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఘాటు విమర్శలు సంధించారు. కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులో మోసమే కనిపిస్తోందని వైఎస్ జగన్ అన్నారు. అధికారంలోకి రావడానికి చంద్రబాబు ప్రజలకు ఎన్నో ఆశలు చూపించారని, సూపర్ 6 పేరుతో మోసగించాడని విమర్శించారు. అందలం ఎక్కాక ప్రజలను ఇప్పుడు హామీలను అమలు చేయలేమంటూ చేతులెత్తేశాడని ధ్వజమెత్తారు. మాడుగుల నియోజకవర్గ ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్ని ఆర్థిక సంక్షోభ పరిస్థితులు తలెత్తినప్పటికీ.. తమ ప్రభుత్వం ఎలాంటి సాకులు చూపలేదని వైఎస్ జగన్ గుర్తు చేశారు. మాట తప్పకుండా మేనిఫెస్టోనే అమలు చేశామని పేర్కొన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించామని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకోసం కట్టుబడి పనిచేశామని, ప్రతి ఇంటికీ మంచి చేశామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ మంచే శ్రీరామ రక్ష అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు చేస్తోన్న మోసాలు ప్రజల ఆగ్రహానికి దారితీస్తాయని పేర్కొన్నారు. వైఎస్ జగన్.. ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఇప్పటికే రైతు భరోసా, స్కూళ్లకు వెళ్తున్న ప్రతి పిల్లాడి తల్లులకు అమ్మ ఒడి, సున్నావడ్డీ, విద్యాదీవెన కింద ఫీజురియింబర్స్ మెంట్, వసతి దీవెన, మత్స్యకార భరోసా, వాహన



మిత్ర, నేతన్న నేస్తం.. వంటి పథకాల కింద నిధులు లబ్దిదారులకు అందేవని, ఈ చర్చ ప్రజల్లో మొదలైందని జగన్ అన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు నెలాఖరు లోపలే వాటిని మంజూరు చేశామని జగన్ చెప్పారు. తమ ప్రభుత్వం లేకపోవడతో ఇవేమీ అమలు కావట్లేదని, ఇంటికే వచ్చి పథకాలు అందించే పరిస్థితి లేదని అన్నారు. జన్మభూమి కమిటీలు చుట్టూ, తెలుగుదేశం నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. స్కూళ్లల్లో టోఫెల్ పీరియడ్‌ను ఎత్తేశారని జగన్ అన్నారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోన్నారంటూ ధ్వజమెత్తారు. విద్యాకానుక పంపిణీ అస్తవ్యస్తమైందని, ట్యాబులు కూడా ఇస్తారన్న నమ్మకం లేదని చెప్పారు. మధ్యాహ్న భోజనంలో ప్రతిరోజూ ఒక మెనూ కూడా ఏ మాత్రం అమలు కావట్లేదని పేర్కొన్నారు. ఇంగ్లిషు మీడియం చదువులు అటకెక్కే పరిస్థితి నెలకొందని, ఆరోగ్య శ్రీ కింద ఒక్కపైసా ఇవ్వట్లేదని, ఇప్పటికే 1,600 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని జగన్ అన్నారు. శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని, రెడ్‌బుక్ పాలన నడుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కక్ష తీర్చుకునే వారిని చంద్రబాబు మరింత పోత్సహిస్తోన్నారంటూ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేస్తోన్న మోసాలన్నింటినీ ప్రజల్లో చూస్తోన్నారని, వారిలో ఆగ్రహం మొదలవుతోందని జగన్ అన్నారు. మళ్లీ వైఎస్ఆర్సీపీ ఘన విజయాన్ని సాధిస్తుందనే ధీమాను వ్యక్తం చేశారాయన. ఈ అయిదు సంవత్సరాల్లో పార్టీ నాయకులను వేధింపులకు గురి చేస్తారని, ఎంతగానో కష్టపెడతారని మండిపడ్డారు. 16 నెలలు జైలు శిక్షే దీనికి నిదర్శనమని చెప్పారు.

# ఏపీలో మహిళలకు మరో పథకాన్ని ప్రారంభిస్తున్న చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగోసారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాత్రం అభివృద్ధితోపాటు సంక్షేమానికి కూడా సమాన ప్రాధాన్యతనిస్తున్నారు. గత పది సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు ప్రజలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. దీంతో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా సంక్షేమ పథకాలను కొనసాగించక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే ఏపీలో పలు పథకాలను ప్రవేశపెడుతున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం తాజాగా మహిళలకు మరో పథకాన్ని తీసుకొచ్చింది.

ఉత్తమమైన విధానాన్ని ప్రవేశపెట్టాలి :- వైద్య, ఆరోగ్యశాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు 2014-19 మధ్య కాలంలో తమ ప్రభుత్వం అమలు చేసిన ఉత్తమమైన విధానాలను తిరిగి ప్రవేశపెట్టాలన్నారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు కొన్ని సూచనలు చేశారు. ఎన్టీఆర్ బేబీ కిట్లను తల్లులకు అందించాలని చంద్రబాబు ఆదేశాలు జారీచేశారు. 2016లో తెలుగుదేశం ప్రభుత్వం ఎన్టీఆర్ బేబీ కిట్లను ప్రారంభించిందని, మహిళలు ప్రసవమైన తర్వాత పుట్టిన పిల్లలకు ఎటువంటి ఇన్ ఫెక్షన్ సోకుండా ఉండేందుకు బేబీకిట్లను అందజేసింది. ఇందులో చేతులు శుభ్రం చేసుకునే లిక్విడ్, దోమతెర గొడుగు, న్యాప్ కిన్లు, చిన్న పరుపు, బేబీ సోప్ ను కిట్ల రూపంలో బాలింతలకు అందించేవారు. వైసీపీ కొన్నాళ్లు అమలుచేసి ఈ పథకానికి తర్వాత స్వస్తి చెప్పింది.

తానే నేరుగా సందర్శిస్తా :- ఫీడర్ అంబులెన్స్ కు, సాధారణ అంబులెన్స్ కు మధ్య అనుసంధానం పెంచాలని, ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన బెడ్ షీట్లు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. నియోజకవర్గ స్థాయిలో పీపీపీ విధానంలో ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు పీపీపీ ఆసుపత్రులను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తామన్నారు. ఏపీలోని అన్ని ఆసుపత్రుల పనితీరు దేశంలోని అన్ని రాష్ట్రాలకన్నా ముందుండాలన్నారు. ఫీడర్ అంబులెన్స్ లు వెళ్లగలిగినప్పటికీ ఆ ప్రాంతాలకు తీసుకువెళ్లకుండా నిర్లక్ష్యం వహిస్తే తానే ఆ ప్రాంతాలను సందర్శిస్తానన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర నుంచి మేల్కొన్నందుకు సంతోషం: కేటీఆర్

హైదరాబాద్ :రాష్ట్రంలో గురుకులాల పనితీరు, పరిశుభ్రతపై పార్టీ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటనతో ప్రభుత్వంలో చలనం వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం ప్రభుత్వ హాస్టళ్ల బాటపట్టింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల హాస్టల్‌కు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందిస్తూ.. గురుకుల స్కూళ్ల సమస్యలపై మొద్దు నిద్రలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొన్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. 8నెలల్లో కలుషిత ఆహారంతో 500 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. నిన్న బీబీపేట పాఠశాలలో 24 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన భోజన వసతి కల్పించాలి. పాఠశాలల్లో వసతులు, సమస్యలను పరిష్కరించాలని కేటీఆర్ కోరారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1000కు పైగా గురుకులాల్లో ప్రాణనష్టం జరగకుండా.. ఆహార నాణ్యతను మెరుగుపరిచేందుకు డిప్యూటీ సీఎం, ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నానని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# రూ.5 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం

మొదటి పేజి తరువాయి

ఇటీవల ఫుడ్ పాయిజన్ కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలోనే మంగళవారం పాఠశాలకు వచ్చిన భట్టి.. పరిసరాల్లో కలిగిదిరుగుతూ పరిశీలించారు. గురుకులంలో చనిపోయిన విద్యార్థి తల్లిదండ్రులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల మృతి బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చనిపోయిన పిల్లల కుటుంబాలకు ఐదు లక్షల పరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం పాఠశాలల పట్ల చూపిన నిర్లక్ష్యమే ఇందుకు కారణమని అన్నారు. పెద్దాపూర్ గురుకులంలో మిగిలిపోయిన పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పాఠశాలనే కాదని.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్శనలో డిప్యూటీ సీఎం భట్టి వెంట మంత్రి పొన్నం ప్రభాకర్, జీవన్ రెడ్డి, ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ ఉన్నారు.

# కాకినాడ పోర్టు ఏ ఒక్క కుటుంబానిదీ కాదు

మొదటి పేజి తరువాయి

కాకినాడ పోర్టు కేంద్రంగా సాగుతున్న బియ్యం రవాణా అంశంపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. నాదెండ్ల మనోహర్ తాజాగా కాకినాడ యాంకరేజి పోర్టు వద్ద చెక్ పోస్టును తనిఖీ చేశారు. ముఖ్యమంత్రితో చర్చించి రేషన్ మాఫియా అక్రమాలపై విచారిస్తామని చెప్పారు. సీఐడీ గానీ, మరే ఇతర సంస్థతో గానీ విచారణ చేయిస్తామని తెలిపారు. తనిఖీలు చేపడితే ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతామని కొందరు వ్యాపారులు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, న్యాయబద్ధంగా వ్యాపారం చేస్తామంటే ఎవరూ అడ్డుకోరని, ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని నాదెండ్ల పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేసే వ్యాపారాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించబోమని స్పష్టం చేశారు. చెక్ పోస్టుల ఏర్పాటు, తనిఖీల విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఉద్ఘాటించారు. కాకినాడ పోర్టు ఏ ఒక్క కుటుంబానిదీ కాదని, పోర్టును రేషన్ మాఫియాకు అడ్డాగా మార్చారని నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు. యాంకరేజి పోర్టు వద్ద లారీలు ఎక్కువ సేపు ఆగకుండా మరో చెక్ పోస్టు ఏర్పాటు చేస్తామని, చెక్ పోస్టుల్లో మూడు షిఫ్టుల్లో ఉద్యోగులు ఉంటారని వివరించారు. తనిఖీ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చూస్తామని చెప్పారు.

# చంద్రబాబు సంచలన నిర్ణయం.. విశాఖ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు కూటమి దూరం

అమరావతి : ఉమ్మడి విశాఖపట్టణం జిల్లాలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానం కోసం జరగనున్న ఉప ఎన్నికకు దూరంగా ఉండాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో గెలవడం పెద్ద కష్టం కాదని, అయినప్పటికీ హుందా రాజకీయాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.చంద్రబాబు నిర్ణయంపై కూటమి నేతలు కూడా హర్షం వ్యక్తం చేశారు. సీఎం అత్యంత హుందాగా వ్యవహరించారని కొనియాడారు. కాగా, ఉప ఎన్నిక నామినేషన్ల గడువు నేటితో ముగియనుంది. కాగా, ఈ ఎన్నికలో జీవీఎంసీ కార్పొరేటర్లు, నర్సీపట్టణం, యలమంచిలి మున్సిపల్ కౌన్సిలర్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 60 శాతానికిపైగా వైసీపీ నుంచి గెలిచినవారే. అభ్యర్థిని పోటీకి నిలిపితే గెలిపిస్తామని టీడీపీ ఎమ్మెల్యేలు కొందరు ముందుకొచ్చినప్పటికీ అంత ప్రయాస అవసరం లేదని చంద్రబాబు భావించారు. ఒక్క ఎమ్మెల్సీ సీటు కోసం అంతమందిని ప్రత్యర్థి పార్టీ నుంచి సమీకరించాల్సిన అవసరం లేదని, దానివల్ల వచ్చే ప్రయోజనం కూడా ఏమీ లేదని చంద్రబాబు అభిప్రాయపడినట్టు తెలిసింది. ఇదిలావుంచితే, ఈ స్థానం నుంచి వైసీపీ తరఫున మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పోటీ చేస్తున్నారు.

# నామినేటెడ్ రేసులో గంధం అప్పాజీ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది



చింతలపూడి **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం ఏ. పోలవరం గ్రామానికి చెందిన గంధం అప్పాజీ,తండ్రి అప్పారావు, తెలుగుదేశం పార్టీలో వివిధ హోదాల్లో రజక సామాజిక వర్గానికి చెందిన గంధం అప్పాజీ పార్టీకి కట్టుబడి గత 27 సంవత్సరాల నుండి తెలుగుదేశం పార్టీలో సేవలందించారు. 1. రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ 2. టీటీడీ బోర్డు సభ్యులుగా 3. ఏలూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా అవకాశం కల్పించమని ఆయన అంటున్నారు. నేను గంధం అప్పాజీ ఏలూరు జిల్లా బీసీ, టిడిపి, సాధికార కన్వీనర్ గా పనిచేస్తున్నాను. మూడు సంవత్సరాలు గ్రామ టిడిపి ప్రధాన కార్యదర్శి పనిచేశాను. 8 సంవ త్సరాలు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా పనిచేశాను. రెండు సంవత్సరాలు మండల తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేశాను. ఒక సంవత్సరం చింతలపూడి నియోజకవర్గ ఎలక్షన్ అబ్జర్వేజర్ చేశారు. మూడు సంవత్సరాలు వివిధ మండలాల్లో పరిశీలకులుగా పార్టీ యందు క్రమశిక్షణ కలిగి కార్యకర్తగా పనిచేశారు. 2012 సంవత్సరంలో బై ఎలక్షన్ సమయంలో చంద్రబాబు నాయుడు మా గ్రామము పక్కనుండి వెళుతుండగా ఆ గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేయించారు. సదరు విషయం చాలా ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. ఎందుకంటే చంద్రబాబు నాయుడు మా గ్రామానికి వచ్చినప్పుడు పరిమిట్ లేదని సెక్యూరిటీ ఆఫీసర్లు ఒప్పుకోలేదు. అప్పుడు నా బాధ చూసి జిల్లా ఎంపీ మాగంటి బాబు చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుపోగా వారు మా గ్రామానికి వచ్చి విగ్రహావిష్కరణ చేశారు. అప్పుడు చంద్రబాబు నాయుడు నీలాంటి బీసీ నాయకులు కష్టపడి పని చేసినందుకు అభినందించారు. నీకు పార్టీ అధికారం రాగానే గుర్తింపునిచ్చే నామినేటెడ్ పదవి ఇస్తానని చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడం జరిగింది. కనుక గుర్తించి నామినేటెడ్ పదవి ఇవ్వాలని గ్రామస్తులు చింతలపూడి నియోజకవర్గ ప్రజానీకం కోరుకుంటున్నారు.



# తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పొన్నూరు పోలీస్.



పొన్నూరు **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :**పొన్నూరు పట్టణం నిడుబ్రోలు ప్రాంతానికి చెందిన కందుల కళ్యాణ్ కుమారుడు మణికంఠ(13) గత సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడు. చుట్టుపక్కల వారిని విచారించి వెతికిన ఫలితం లేకపోవడంతో తండ్రి కుమారుడి ఆచూకీ కోసం అర్బన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. సిఐ భాస్కర్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వగా మంగళగిరిలో ఉన్నట్లు తెలిసింది .మణికంఠను మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. ఏఎస్ఐ సుభాని పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి: ఎంపీపీ భవనం పద్మలీల.



పొన్నూరు **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** గుంటూరు జిల్లా పొన్నూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రెండవ రోజు గ్రామ కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల ఎంపీపీ భవనం పద్మలీల పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ నిర్దేశించిన ప్రణాళికలు అవగతం చేసుకొని అధికారులతో పాటు సర్పంచులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆమె సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను శిక్షణా కార్యక్రమంలో ఈఓపిఆర్డి ప్రసాదరావు అవగాహన కల్పించారు. గ్రామ ప్రణాళికలు, తీసుకోవలసిన చర్యలు, అభివృద్ధి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

# ట్రాన్స్ ఫార్మర్లు దొంగిలించిన గుర్తుతెలియని వ్యక్తులు ఆందోళనలో రైతులు





జీలుగుమిల్లి **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పి .రాజవరం గ్రామానికి చెందిన సూరిశెట్టి ఏసుబాబు అనే రైతు పొలంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్ ఫార్మర్ లోని రాగు వైరు దొంగిలించారు. అందులోని సుమారు పది నుండి 14 కేజీల రాగి వైరు కలిగి ఉంటుంది. మార్కెట్లో దాని విలువ కేజీ 2500 దాదాపుగా ఉంటుంది. రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా రైతు పొలంలోకి వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# నూతన ఇసుక రీచ్ అప్రోచ్ రొడ్డు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి...

-సీజనల్ వ్యాధుల వ్యాప్తి అరికట్టేందుకు చర్యలు....

-సుల్తానాబాద్ మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష....



రామగుండం **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ మండలంలో విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ పాఠశాలలు, నూతన ఇసుక రీచ్, తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల్లా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం రెగ్యులర్ గా శుభ్రం చేయాలని అన్నారు. గట్టేపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారికి నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ సూచించారు. సుల్తానాబాద్ పర్యటన సందర్భంగా అవెన్యూ ప్లాంటేషన్ ను కలెక్టర్ పరిశీలించారు. నీరుకుల, గట్టెపల్లి గ్రామాలలో నూతన రోడ్లకు ఇరువైపులా ఎత్తైన మొక్కలతో అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని అధికారులకు సూచించారు. సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల, గట్టెపల్లి గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేయబోయే ఇసుక రీచ్ లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఇసుక రీచ్ లకు అవసరమైన అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సుల్తానాబాద్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ పెండింగ్ జరిగిన దరఖాస్తుల వివరాలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల పై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలు జిల్లా కలెక్టర్ వెంట అసిస్టెంట్ డైరెక్టర్ మైన్స్ శ్రీనివాస్ ,సుల్తానాబాద్ తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో దివ్య దర్శన్ రావు పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సచిన్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు

# మా భూమిని మాకు ఇప్పించండి

- మీ కోశంలో వినతపత్రం అందజేసిన బాధితులు



(మందస - )**ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** శ్రీకాకుళం జిల్లా, మందసలో నివాసముంటున్న ముప్వ.వైద్యనాథంకు చెందిన సుమారు రెండు వందల ఎకరాల ఆస్తిని గత వైసిపి ప్రభుత్వ హయాములో, అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు కొంత మంది పెద్దలతోకలసి మా భూమిని ఆక్రమించి జగనన్న కోలనీ పేరుతో పంచి పెట్టారని, దానికి సంబంధించిన ప్రతీ డాకుమెంట్స్ మాదగ్గర ఉన్నాయని, కుమారుడు వాసుదేవ రావు, పెద్ద కుమార్తె వరలష్మి, రెండవ కుమార్తె లలిత, తెలిపారు. స్థానిక ఎమ్మార్వో పాపారావు, సర్వేయర్ మోహన రావు, సెక్రటరీ శైలజ, జూనియర్ సెక్రటరీ మౌలి లు మమ్మల్ని బయపెడుతున్నారని, మా భూమిని మంగళ.రమానంద, భార్య జ్యోతి, కబ్జా చేశారని, అందులో జీడీ పప్పు ఫ్యాక్టరీని మంత్రి అండ దండలతో నిర్మించారన్నారు. సి విషయమై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, మీరు ఏమీ చెయ్యలేరని, ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ అక్కడ అధికారులు బెదిరిస్తుంన్నారని, ఇప్పటికైనా రీ సర్వే చేసి, మాకు న్యాయం జరగకపోతే చావటానికైనా సిద్ధమని తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం మీ కోసం కార్యక్రమంలో కలక్టర్ దినకర్ పుండ్కర్ ను కలసి వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ రెండు రోజులలో అధికారులు స్పందిస్తారన్నారు.

# వైకాపా ఎంపిటిసిలు సర్పంచ్ లతో ఎంపిపి గోము వెంకటలక్ష్మి సమీక్షా సమావేశం పలు అంశాలపై దిశా నిర్దేశం పాల్గొన్నా వైకాపా నాయకులు ప్రజాప్రతినిధులు



రాజవొమ్మంగి, **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :**అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల కేంద్రంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిటిసిలు సర్పంచ్లు శిక్షణ కార్యక్రమాలు అనంతరం మండల వైకాపా ఎంపిపి గోము వెంకటలక్ష్మి,సర్పంచ్లు సంఘం అధ్యక్షుడు కొంగర మురళీకృష్ణ అధ్యక్షతన మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వైకాపా ఎంపిటిసిలు సర్పంచ్లు తదితరులతో వారు సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో వైకాపా ఎంపిపి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పింఛన్లు పెంపు తప్ప మిగతా సంక్షేమ పథకాలు అమలు కాలేదని తెలియజేస్తూ గత వైసిపి ప్రభుత్వంలో ఎన్ ఆర్ ఇ జి ఎస్ లో మంజూరు అయినా ఒక కోటి ఇరవై లక్షల రూపాయల సీసీ రోడ్లలను ఇప్పుడు ప్రారంభిస్తున్నారని, చిన్నయ్య పాలెం సింగంపల్లి బీటీ రోడ్ పనులు మొదలు పెట్టాలని,వాటితో పాటు జలజీవన్ మిషన్ ద్వారా వాటర్ ట్యాంక్ పైప్ లైన్లు,మంజూరైన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, సంక్షేమం అభివృద్ధి పథకాల కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచ్ లకు ఎంపీటీసీ లకు ప్రాధాన్యత ఇవ్వడం తప్పని సరియని ఆమె తెలుపుతూ మనందరం కలిసికట్టుగా ఉంటే ఎవరు కూడా అసత్య ప్రచారాలు చేయరని పేర్కొన్నారు ఈ సమావేశంలో మండల వైసిపి కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ,వైస్ ఎంపీపీలు చప్పా చంద్రరాణి,జుర్రా రాజేశ్వరీ,ఎంపీటీసీలు,చుండ్రు లోవలక్ష్మి,కనిగిరి గంగా దుర్గ,ఆవుగడ్డ నిర్మలదేవి, కోసూరు చిన్నలమ్మ, కానెం అచ్చయమ్మ కోప్షన్ మెంబర్ అడపా కామేష్,సర్పంచ్లు ఆగూరి శుభలక్ష్మి,చీడి శివ,మిరియాల గణలక్ష్మి,మిరియాల సత్యవతి,సావిరాల చంద్రుడు, కించు వెంకటలక్ష్మి,బీమిరెడ్డి శుభలక్ష్మి,కుంద్రు కాంతం,తొంటా ఆదినారాయణ తదితరులతోపాటు కనిగిరి దుర్గ ప్రసాద్,చింతలపూడి వెంకట రమణ,కనిగిరి వీరబాబు,జుర్రా జాన్ బాబు, కుంద్రు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రైతు,కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి....

ఎన్టిపిసి ప్లాంట్ గేట్ 2 వద్ద కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేసిన సిఐటియు నాయకులు...



రామగుండం **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** కేంద్ర,రాష్ట్ర జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియనులు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని అలాగే స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 14న. జరిగే "జన జాగరణ" జయప్రదం చేయాలని కోరుతూ, సిఐటియు అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్టిపిసి ప్లాంట్ గేట్ 2 వద్ద కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు.అనంతరం యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గిట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ మాట్లాడుతూ, అనేక త్యాగాలు, రక్త తర్పణతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ లుగా మారుస్తూ, వేతనాల కోడ్ చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి మంగళం పాడుతూ, పారిశ్రామిక సంబంధాల కోడ్ చట్టంతో సమ్మె హక్కును కాలరాస్తూ, సామాజిక భద్రత కోడ్, వృత్తి సంబంధిత రక్షణ ఆరోగ్యం పని పరిస్థితుల కోడ్, పిఎఫ్ ఈఎస్ఐ,వెల్ఫేర్ బోర్డులపై గొడ్డలి వేటు వేస్తున్నదని మండిపడ్డారు.ఆనాడు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా భారత ప్రజలు సుదీర్ఘ పోరాటం చేస్తే నేడు స్వదేశీ నినాదంతో అధికారంలోకి వచ్చిన బిజెపి కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను, ఆర్థిక సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతుందని, కేంద్ర బిజెపి వినాశనకర చర్యలన్నింటినీ కార్మిక వర్గం ఐక్యంగా ఎదుర్కోవాలని, రైతు, కార్మిక ,ప్రజా వ్యతిరేక బడ్జెట్ ను నిరసిస్తూ,అఖిలభారత పిలుపును తెలంగాణ రాష్ట్ర కార్మిక, రైతు సంఘాలు ఇందులో భాగస్వాములై ఆగస్టు 14న. అర్ధరాత్రి వరకు జన "జాగరణ" దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండి యాకూబ్, దండ రాఘవరెడ్డి, కాదశి మల్లేష్, కనకయ్య, హుస్సేన్ రెడ్డి, సంపత్, నరేష్, ధరణి రాజయ్య,శ్రీకాంత్, దేవేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, చెల్మా రెడ్డి పాల్గొన్నారు.

# ఎల్ఐసి కార్యాలయంలో కేరళ వరద సహాయ నిధి వసూలు....

-సిఐటియు నాయకులు...



రామగుండం **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** సిఐటియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా కేరళ రాష్ట్రంలో కొండ చరియలు విరిగిపడి వరద భీభత్సం మూలంగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగిన వయనాడ్ ప్రజానీకానికి సహాయం అందించడంలో భాగంగా ఎల్ఐసి, రామగుండం బ్రాంచ్ కార్యాలయ సిబ్బంది నుండి రు.4126/-విరాళాలు సేకరించడం జరిగింది. సిఐటియు ఎన్టిపిసి రామగుండం ఏరియా కమిటీ సేకరించిన ఈ డబ్బును జిల్లా కమిటీ నుండి రాష్ట్ర కమిటీ ద్వారా కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించడం జరుగుతుంది. ఈ సందర్భంగా సిఐటియు పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఎన్ బిక్షపతి మాట్లాడుతూ, కేరళలోని వయనాడులో కొండ చర్యలు విరిగి వరద బీభత్సం జరగడం వల్ల ఇప్పటికే 400 పైగా మరణాలు సంభవించడంతో, వేలాదిమంది క్షతగాత్రులు అయ్యారు. ఇంకా 100 మందికి పైగా ఆచూకీ తెలియలేదు. మూడు గ్రామాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. అపారమైన ఆస్తి నష్టం జరిగింది. ఇలాంటి పరిస్థితులలో వయనాడ్ ప్రజలను ఆదుకోవడంలో భాగంగా సహృదయంతో రామగుండం ఎల్ఐసి సిబ్బంది స్పందించి విరాళాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికి సిఐటియు ఎన్టిపిసి రామగుండం ఏరియా కమిటీ తరఫున ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

# యువతకే అధిక ప్రాధాన్యత -కేటీఆర్

-రానున్న రోజుల్లో రవీందర్‌కు మంచి అవకాశం

-కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచన

-కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన రవీందర్ యాదవ్



రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం, **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** రానున్న ఎన్నికల్లో యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నిజమైన గులాబీ కార్యకర్తలకు పార్టీ పదవులు దక్కనున్నట్లుగా వెల్లడించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని స్పష్టం చేశారు. భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఆ పార్టీ సీనియర్ నేత రవీందర్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం నందినగర్‌లోని ఆయన నివాసంలో కలిసి ఫోటో ఫ్రేమ్‌ను అందజేశారు. దాన్ని చూసి కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పార్టీ కార్యక్రమాల్ని జనంలోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారని రవీందర్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లిలోని రాజకీయ పరిణామాలపై కేటీఆర్ ఆరా తీశారు. జనంలో ఉండాలని రవీందర్ యాదవ్‌కు ఈ సందర్భంగా సూచించారు. రానున్న రోజుల్లో మంచి అవకాశం దక్కనున్నట్లుగా వెల్లడించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ ముందుకు వెళ్లాలని తెలిపారు..

# హర్ ఘర్ తీరంగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి, ప్రతి ఒక్కరు వారి ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలి



హసన్ పర్తి మండలం **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట, జిల్లా, పార్లమెంట్ నాయకత్వాల పిలుపుమేరకు ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఎల్కతుర్తి మండలంలో మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కుడుతాడి చిరంజీవి ఆద్వర్యంలో బస్టాండు కూడలిలో సామూహిక జనగణమన గీతం ఆలపించడం జరిగింది, అదేవిధంగా మండలంలోనీ పలు గ్రామాలు ఎల్కతుర్తి, దామెర, చింతలపల్లి, గోపాలపూర్, జగన్నాథ పూర్, జిలుగుల, కోతులనడుమ, వల్భాపూర్ గ్రామాలల్లో తిరంగ బైక్ ర్యాలీ తీయడం జరిగింది, మహనీయుల విగ్రహాలను శుద్ధి చేసి పూలమాలలు వేయడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ప్రభారీ గుజ్జ సత్యనారాయణ రావు పార్లమెంట్ ఎన్నికల మండల ఇంచార్జీ బల్ల శ్రీనివాస్ రావు హాజరై బైకు ర్యాలిని ప్రారంభించారు,ఈ సందర్భంగా మండల ఇంచార్జీ బల్ల శ్రీనివాస్ రావు, మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశభక్తిని చాటిచెప్పే విధంగా తమ తమ ఇండ్లపైన జాతీయ జెండాను ఎగరవేయాలని కోరారు,ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అడేపు శ్రీవర్ధెన్, కంచర్ల శంకరయ్య, జనగాణి కిష్టయ్య, ముస్కే వెంకటేష్, పల్లేపాటి మధుకర్, ఆరెపల్లి వినోద్, చిదురాల వెంకటేష్, పెరుగు మధు, మంతుర్తి శ్రీకాంత్, కొమ్మిడి లచ్చిరెడ్డి, హంబిరు శ్రీనివాస్, శ్యాం సింగ్, రగొత్తం రెడ్డి, చిర్ర శ్రీను, హింగే దేవరావు, కృష్ణం రాజు, పోలు కోటేశ్వర, రావుల సంపత్, రజినీకాంత్, అవుల రాజు, మంతుర్తీ తిరుపతి, రాజు, అరవింద్, యువరాజ్, దసారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన, ఉమ్మడి రాష్ట్రాల ఐఎన్టీయూసీ కార్యదర్శి పూసల తిరుపతి....



రామగుండం **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :**జనక్ ప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని, మంగళవారం ఆయన నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సత్కరించి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పూసల తిరుపతి మాట్లాడుతూ,సింగరేణి లో ఒక సాధారణ ఉద్యోగిగా వచ్చిన జనక్ ప్రసాద్ ఆనాడు సింగరేణి కార్మికులు పడుతున్న కష్టాలను, ఇబ్బందులను చూసి మనసు చలించిపోయి. ఈ కార్మిక వర్గం కోసం ఏదైనా చేయాలి అనే తపనతో కార్మిక వర్గ శ్రేయస్సు కోసం, హక్కుల పరిరక్షణ కోసం కార్మిక పోరాటాలు తప్ప వేరే మార్గం లేదని భావించి, కార్మిక ఉద్యమాన్ని నిర్మించి వేలాదిమంది సింగరేణి కార్మికుల హక్కుల సాధన నాయకుడిగా ఐఎన్టియుసి యూనియన్ కి నాయకత్వం వహించి రాష్ట్ర జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగిన,ఐఎన్టియుసి యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి గా, సింగరేణి కోల్ మైన్స్ స్ లేబర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ గా, కార్మికుల కోసం చేస్తున్న పోరాటాలను ఎనలేని సేవలను గుర్తించిన మన కాంగ్రెస్ ప్రభుత్వంలో వారికి గౌరవంగా తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ గా బి జనక్ ప్రసాద్ ని నియమించడమైనది. యావత్తు కార్మిక వర్గం, సింగరేణి అధికారులు హర్షించిన విషయము మన అందరికీ తెలిసిందే, భవిష్యత్ లో ఇంకా అనేక ఉన్నత శిఖరాలను అదిరోహించడం అనేది కూడా మన అందరం చూస్తాము,కార్మికుల తలలో నాలుకలాగా నిలిచిన గొప్ప కార్మిక పక్షపాతి యావత్ కార్మిక వర్గంతో, ప్రభుత్వ పెద్దలతో, సింగరేణి ఉన్నత అధికారులతో ఎన్నో మన్నెలను పొందిన, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి జనక్ ప్రసాద్ అని అన్నారు.

# ఒరిజనల్ అసైనీలకు లబ్ది చేకూర్చేందుకే ఫ్రీ హెూల్డ్ చేసిన అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు మూడు నెలల పాటు నిలిపివేత

రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** గత ప్రభుత్వం లో వైసీపీ నేతలు కుట్ర పూరితంగా ఎస్ సీ, ఎస్టీల అసైన్డ్ భూములను చౌకగా కొట్టేశారు: మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలియజేశారు అసైన్డ్ చట్టానికి సవరణ వస్తుందని ముందే తెలుసుకొని వైసీపీ నేతలు ఒరిజనల్ అసైనీల నుండి అతి తక్కువ ధరలకే భూములను కొనేశారుఅని మంత్రి అనగాని అన్నారు నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు అసైన్డ్ భూములను ఫ్రీ హెూల్డ్ చేశారన్నారు కొన్ని ప్రభుత్వ భూములను కూడా నిషేధిత జాబితా నుండి ఫ్రీ హెూల్డ్ చేశారుచెప్పేరు ప్రజా అవసరాలకు ఉంచిన ప్రభుత్వ భూములను ఫ్రీ హెూల్డ్ చేసి రిజిస్ట్రేషన్లు చేశారని మంత్రి అనగాని మండిపడ్డారు రిజిస్ట్రర్ అయిన అసైన్డ్ భూముల్లో కొన్ని నిబంధనలకు విరుద్ధంగా గిఫ్ట్ డీడ్లు గా చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారన్నారు 20 ఏళ్ల పరిమితి దాటని భూములను కూడా ఫ్రీ హెూల్డ్ చేసినట్లు సమాచారముంది ఫ్రీ హెూల్డ్ వ్యవహారంలో జరిగిన తప్పులన్నింటీని సరిచేసేందుకే మూడు నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేత కార్యక్రమం చేపట్టమన్నారు ఒరిజనల్ అసైనీలకు వందకు వంద శాతం పూర్తి న్యాయం చేస్తాంఅని మంత్రి అనగాని తెలియజేశారు ఫ్రీ హెూల్డ్ పేరుతో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు ఉంటాయిఒక ప్రకటనలో తెలిపారు



## అక్రిడేషన్ తో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి ....

### ఉపా తహసీల్దార్ కు వినతి పత్రం అందజేసిన డిజెఎఫ్ రామగిరి మండల జర్నలిస్టులు....



రామగుండం **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు మనసాని కృష్ణారెడ్డి,రాష్ట్ర అధ్యక్షుడు మోటాపలుకుల వెంకట్ ఆదేశాల మేరకు, రామగిరి మండలం డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కళ్లేపల్లి కుమార్, ఉపాధ్యక్షుడు కన్నూరి రాజు ఆధ్వర్యంలో రామగిరి డిజేఎఫ్ జర్నలిస్టులు మంగళవారం స్థానిక రామగిరి నాయబ్ తహసీల్దార్ యజ్ఞంభట్ల మానస కి వినతి పత్రం అందజేశారు.వినతి పత్రం లో అక్రిడేషన్ తో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ఇంటి స్థలం తో పాటు ఇంళ్ల స్థలాలు కేటాయించాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రయివేట్ స్కూల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలని,అక్రమ కేసుల నుండి రక్షణ కలిపించాలని నాయబ్ తహసీల్దార్ కు ఇచ్చిన పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జాతీయ కార్యదర్శి సబితం లక్ష్మణ్, పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు కన్నూరి రాజు, ప్రధానకార్యదర్శి బోయిని ప్రసాద్, కోశాధికారి పెయ్యాల రమేష్,సభ్యులు సిద్ధం ప్రదీప్ కుమార్,దాసరి భరత్,ఐలి సాయి కృష్ణ పాత్రికేయులు పాల్గొన్నారు.

## అసైన్డ్ భూముల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

### రైతులకు మేలు జరిగే విధంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి



రేపల్లె **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** రేపల్లె ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అన్ని శాఖల అధికారులతో రెవెన్యూ సదస్సుపై ఆర్డీఓ హెలా షా రాన్ సమావేశం నిర్వహించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవిన్యూ సదస్సులు విజయవంతం చేయాలని అసైన్డ్ భూముల విషయంలో జాగ్రత్తలు పాటించాలని భూమి ఉన్న రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసేందుకు తగిన సూచనలు సలహాలు రైతులకు ఇవ్వాలన్నారు

## బిజెపి మండల సమావేశం హర్ ఘర్ తిరంగ కార్యక్రమం.



కాకినాడ జిల్లా, జగ్గంపేట, **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** జగ్గంపేట మండల బీజేపీ సమావేశం స్థానిక సాహితి పబ్లిక్ స్కూల్ లో జరిగింది.ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు నిచ్చిన హర్ గర్ తిరంగా కార్యక్రమం గురుంచి.బీజేపీ కార్యకర్తలకు జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ట. మంగ రాజు దిశా నిర్దేశం చేశారు.ప్రతి గ్రామం లోనూ,ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. జగ్గంపేట అసెంబ్లీ కన్వీనర్ దాట్ల.కృష్ణ వర్మ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి జాతీయ జెండా పట్ల గౌరవం,జాతీయత భావాలు వుండాలని ఆగస్టు పదిహేను పురస్కరించుకొని అన్ని ప్రభుత్వ,ప్రైవేటు కార్యాలయాలు,ప్రతి ఇంటి పైన మన దేశ జెండా ఎగురవేయలని పిలుపు నిచ్చారు.ఈ కార్య క్రమం మండల అధ్యక్షుడు మెడిసెట్టి.వీరబాబు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమం లో విశ్వకర్మ యోజన జిల్లా సెక్రటరీ వీరబాబు,మండల కార్య దర్శి పల్లా.రాము,జిల్లా కార్య వర్గ సభ్యులు అడపా.దొరబాబు,కొత్త.శ్రీనివాస్ రెడ్డి,నరేంద్ర పట్నం కోరుమిల్లి.నాగేశ్వర్ రావు,మహేశ్వర్ రావు,పార్టీ కార్య కర్తలు పాల్గొన్నారు.

## జూరాల ప్రాజెక్టును సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్



అమరచింత వనపర్తి జిల్లా **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ మెంచ్ నగేష్ మంగళవారం సందర్శించారు. ఆత్మకూరు పట్టణంలో ఆయన పలు ప్రైవేటు వెంచర్ల పరిశీలన నిమిత్తం వచ్చిన ఆయన స్థానిక ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుండి రెవిన్యూ ఎస్ డి సి వెంకటేశ్వర్లు తో కలిసి ప్రాజెక్టుయు సందర్శించారు. జూరాల ప్రాజెక్టు నీటి సామర్థ్యం అలాగే ప్రాజెక్టు కు ఎగువ నుండి వస్తున్న వరద ప్రవాహాన్ని సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. గత పది పదిహేను రోజులుగా జూరాల ప్రాజెక్టుకు భారీ వరద కొనసాగిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండటాన్ని ఆయన అభినందించారు. ఎగువ దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాలలో కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తిని అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుపై అమరచింత తహసిల్దార్ బి రమేష్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అమరచింత రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ భూ సమస్యలు సకాలంలో పరిష్కరించాలి....

### -అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్...



రామగుండం **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** మండలంలోని పెండింగ్ లో ఉన్న భూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ,అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ అంతర్గాం తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మండలంలో ఉన్న పెండింగ్ ధరణి సమస్యలు ,భూసేకరణ, వివిధ సర్టిఫికెట్ల జారి మొదలగు అంశాల పై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మండలంలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళిక ప్రకారం పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో అవసరమైన ధ్రువీకరణ చేపట్టి పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలని అన్నారు. మీసేవ కేంద్రాల ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిశీలించి, సంబంధిత సర్టిఫికెట్లు జారీ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.



అనంతరం తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో మొగల్ పహాడ్ గ్రామంలోని భూ సమస్యలు, సర్వే సమస్యల గురించి గ్రామస్థులతో చర్చించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో వన మహోత్సవం కార్యక్రమం క్రింద అదనపు కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సమావేశంలో అంతర్గాం మండల . తాసిల్దార్ రమేష్ , డిప్యూటీ తాసిల్దార్ సతీష్ రావు, సీనియర్ అసిస్టెంట్ సమ్మయ్య ,జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, మండల పరిశీలక అధికారులు ఎగ్గాడి శ్రీధర్, శ్రీమాన్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎగరాలి ప్రతి ఇంటి పై మువ్వన్నెల జెండా. కందుల వేణు వర్ధన్

పొన్నూరు **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగురవేయాలిని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు, అఖిల భారత గౌడ సంఘం గుంటూరు జిల్లా యువత అధ్యక్షుడు, తెనాలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నేత కందుల వేణు వర్ధన్ అన్నారు మంగళవారం తెనాలి మారీస్ పేట ఆయన నివాసం వద్ద మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ 75 సంవత్సరాల పూర్తయిన మహోత్సవ్ లో భాగంగా భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కోణిదెల పవన్ కళ్యాణ్ గార్ల పిలుపు మేరకు నేడు ఆగస్ట్ 13 కాబట్టి తమ ఇంటి పై జాతీయ జెండా ఎగురవేశారు ఆగస్ట్ 13,14,15 ప్రతి ఒక్కరు తమ తమ ఇళ్ల పై జాతీయ పతాకాన్ని ఎగుర వేసి దేశ స్ఫూర్తిని చాటలన్నారు జాతీయ జెండా అన్నది భారతదేశంలో జన్మించిన ప్రతి ఒక్కరిది ఇది ఒక కులానికో మతానికో వర్గానికో ప్రాంతానికో ఒక్క పార్టీకో చెందింది కాదు ఇది మన అందరిదీ భారతదేశ స్వాతంత్ర్య కోసం తమ జీవితాలను ధారపోసిన ఎందరో అమర వీరుల త్యాగ ఫలం నేటి ఈ 75 వసంతాల పూర్తయిన అమృత మహోత్సవం అనీ కందుల వేణు వర్ధన్ అన్నారు.



ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగురవేయాలిని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు, అఖిల భారత గౌడ సంఘం గుంటూరు జిల్లా యువత అధ్యక్షుడు, తెనాలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నేత కందుల వేణు వర్ధన్ అన్నారు మంగళవారం తెనాలి సాయంత్రం 5:00 గంటలకు మారీస్ పేట ఆయన నివాసం వద్ద మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ 75 సంవత్సరాల పూర్తయిన మహోత్సవ్ లో భాగంగా భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కోణిదెల పవన్ కళ్యాణ్ గార్ల పిలుపు మేరకు నేడు ఆగస్ట్ 13 కాబట్టి తమ ఇంటి పై జాతీయ జెండా ఎగురవేశారు ఆగస్ట్ 13,14,15 ప్రతి ఒక్కరు తమ తమ ఇళ్ల పై జాతీయ పతాకాన్ని ఎగుర వేసి దేశ స్ఫూర్తిని చాటలన్నారు జాతీయ జెండా అన్నది భారతదేశంలో జన్మించిన ప్రతి ఒక్కరిది ఇది ఒక కులానికో మతానికో వర్గానికో ప్రాంతానికో ఒక్క పార్టీకో చెందింది కాదు ఇది మన అందరిదీ భారతదేశ స్వాతంత్ర్య కోసం తమ జీవితాలను ధారపోసిన ఎందరో అమర వీరుల త్యాగ ఫలం నేటి ఈ 75 వసంతాల పూర్తయిన అమృత మహోత్సవం అనీ కందుల వేణు వర్ధన్ అన్నారు.

## జాతీయ సమైక్యతకు ప్రతిరూపం.. "హర్ ఘర్ తిరంగా"

### జిల్లా కలెక్టర్ డా. జి.సృజన




ఎన్టీఆర్ జిల్లా, **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** జాతీయ సమైక్యతను చాటిచెప్పేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.సృజన తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో హర్ ఘర్ తిరంగా- తిరంగా కాన్వాస్‌పై సంతకాలు చేసే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సృజన.. డీఆర్వో వి.శ్రీనివాసరావు తదితరులతో కలిసి కాన్వాస్‌పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ జాతీయ సమైక్యతను, సమగ్రతను కాపాడటం దేశ పౌరులుగా మనందరి బాధ్యత అని.. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగమైన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. జాతీయ పతాకం ఔన్నత్యాన్ని, ప్రాధాన్యాన్ని చాటిచెప్పేందుకు, ప్రతిఒక్కరిలో దేశభక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని కలెక్టర్ సృజన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్లు డా. ఎ.మహేష్, కేవీ సత్యవతి,పౌర సరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. కె.రమేష్, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. (డీఐపీఆర్వో, ఐ అండ్ పీఆర్, ఎన్టీఆర్ జిల్లా వారి ద్వారా జారీ)

## విద్యార్థులు లక్ష్యం వైపు దృష్టి పెట్టాలి

### -పుట్టిన ప్రాంతం,కన్న తల్లిదండ్రులు గర్వించేలా ఎదగాలి

### -సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీనారాయణ



హసన్ పర్తి మండలం **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** విద్యార్థులకు ఇంటర్ విద్య కీలకం మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఘనంగా మోషన్ కళాశాల ఫ్రెషర్స్ వేడుకలు విద్యార్థులు లక్ష్యం వైపు దృష్టి పెట్టి విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి. వి.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం హనుమకొండ అంబేద్కర్ భవన్ లో మోషన్ జూనియర్ కాలేజ్ ప్రెషర్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు.సెలబ్రేషన్స్ కు ముఖ్యఅతిథిగా సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి. వి.లక్ష్మీనారాయణ హాజరై ప్రసంగించారు.తల్లిదండ్రులు ఎంతో కష్టపడి అప్పులు తెచ్చి మంచి కళాశాలలో జాయిన్ చేయించారు,దాన్ని విద్యార్థులు గుర్తుంచుకొని ఎప్పటికప్పుడు తమను తాము మెరుగుపరుచుకుంటూ మంచి ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీసేందుకు అనేక సాధనాలు మనకు అందుబాటులో ఉన్నాయని వాటిలో ముఖ్యంగా మొబైల్ దానిని విద్యార్థులు రెండు సంవత్సరాలు పక్కకు పెట్టాలని సూచించారు.విద్యార్థులు తము నేర్చుకునే దానిని కష్టంగా కాకుండా ఇష్టంగా నేర్చుకోవాలని, ఇష్టంగా నేర్చుకుంటే లక్ష్యాన్ని చేరుకోవడం సులభం అవుతుంది అన్నారు. అనంతరం.కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.ఈ రెండు సంవత్సరాలు ఎవరైతే కష్టపడతారో వారు విజయం సాధించి ఉన్నత లక్ష్యాలను చేరుకొని జీవితాంతం చాలా ఆనందంగా గడుపుతారని ఎవరైతే ఈ రెండు సంవత్సరాలు ఎవ్వరు ఎంజాయ్ చేస్తారో వారు జీవితాంతం కష్టపడాల్సి వస్తుందని,అందుకోసం ఈ రెండు సంవత్సరాలు విద్యార్థులు లక్ష్యాన్ని సాధించడం కోసం ప్రయత్నించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్స్ చిర్ర గణేష్,శరత్, పేరుమాండ్ల అనిల్, కాలేజీ కోటా అధ్యాపకులు అనుజ్ కపూర్, సాహిల్ కత్యాల్, మోహన్ మంగళం, ప్రదీప్ పట్కార్, దమన్, అవినాష్, సురేందర్, కాలేజీ సిబ్బంది మురళి, రమేష్, సాగర్, రాజు, శశి, శివ, అరుణ్, రవళి, అరుణ, శిల్ప, మమత తదితరులు పాల్గొన్నారు.

## పాపాయిపాలెం లో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన ఏవో



వేటపాలెం, **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** మండలంలోని పాపాయిపాలెం గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఐ కాసీ విశ్వనాథ్ మంగళవారం పరిశీలించడం జరిగింది. పంట నమోదు కార్యక్రమం వల్ల రైతులకు కలిగే ఉపయోగాలను గురించి వివరించడం జరిగిందని తెలిపారు. పంట నమోదు లో భాగంగా ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన, ఉచిత పంటల భీమా నమోదు చేసుకోవచ్చన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ అమ్మకం పైన రైతులకు లాభం కలుగుతుందన్నారు. ఒకవేళ పంట నష్టం జరిగితే ఈ క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల రైతుకు నష్టపరిహారం అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో రైతులు ఏ రకమైన పంటను పండిస్తున్నారు నమోదు చేయడం వల్ల ఆదాయ ఉత్పత్తులు పెంచుకోవడానికి పనికొస్తుందని అందువల్ల ప్రతి రైతు విధిగా రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకుల ద్వారా పంట నమోదు ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాపాయిపాలెం వ్యవసాయ సహాయకులు వినయ్, రైతులు పాల్గొన్నారు.

## 20 నుంచి ఇంటింటికి ఓటరు సర్వే..



పొన్నూరు **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** 2025 స్పెషల్ సమ్మరీ రివిజన్ ( ఎస్ఎస్ఆర్) ఓటరు జాబితా సవరణ కార్యక్రమం మంగళవారం పొన్నూరు మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. నియోజకవర్గ ఎన్నికల అధికారి హరిహరనాథ్ పాల్గొని ఈనెల 20 నుంచి అక్టోబర్ 18 వరకు ఇంటింటి ఓటరు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏ ఈ ఆర్ ఓ లు ,బిఎల్వోలు సమన్వయంతో ఎస్-ఎస్ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. మున్సిపల్ కమిషనర్ నయుం అహ్మద్, ఎన్నికల అధికారి ఫణి, నియోజకవర్గస్థాయి తహసిల్దార్లు, బిఎల్వోలు పాల్గొన్నారు.

## సమస్యలను జనసేన జగ్గంపేట ఇంచార్జ్ తో వివరినా కార్యక్రమం.



కాకినాడ జిల్లా జగ్గంపేట **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ శ్రీ తుమ్మలపల్లి రమేష్ ని రాష్ట్ర అధ్యక్షుడు . రాంజీ ప్రసాద్ మరియు కాకినాడ జిల్లా %జ=మీ% లు మర్యాద పూర్వకంగా కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ల సమస్యలు పట్ల వివరించడం జరిగింది. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నట్టు ఉద్యోగుల సమస్యలను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని, సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తారని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జగ్గంపేట, ప్రత్తిపాడు,ఏలేశ్వరం, పెద్దాపురం, కిర్లంపూడి పాల్గొన్నారు.

## విజయ వంతంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రిహార్సల్స్.

### ఫుల్ డ్రెస్ సన్నద్ధతను పరిశీలించిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు.



ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 15న రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరగనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల సమక్షంలో మంగళవారం నిర్వహించిన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ విజయవంతమయ్యాయి. రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) ఎస్.సురేష్ కుమార్.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన, ఏపీఎస్పీ డీఐజీ బి.రాజకుమారి, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీ శంకర్ తదితరులతో కలిసి రిహార్సల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. త్రివర్ణ శోభిత వేడుకలకు సంబంధించి అడిషనల్ డీజీపీ (ఎఫ్ఏసీ), ఏపీఎస్పీ బెటాలియన్స్, ఐజీపీ (శాంతిభద్రతలు) సీహెచ్ శ్రీకాంత్ నోడల్ అధికారిగా, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు పోలీస్ సమన్వయ అధికారిగా, ప్రోటోకాల్ డైరెక్టర్ ఎం.బాలసుబ్రమణ్యం రాష్ట్ర సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారు. ఏఎస్ఆర్ జిల్లా అడిషనల్ ఎస్పీ కె.ధీరజ్ పరేడ్ కమాండర్‌గా, ఏపీఎస్పీ 14వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పీవీ హనుమంతు పరేడ్ సెకండ్-ఇన్-కమాండ్‌గా, పరేడ్ అడ్జుటెంట్‌గా ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ఆర్ఐ టి.ప్రభాకర్‌రావు వ్యవహరించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కవాతులో తెలంగాణ స్టేట్ పోలీస్, ఏపీఎస్పీ రెండో బెటాలియన్ (కర్నూలు), ఏపీఎస్పీ మూడో బెటాలియన్ (కాకినాడ), ఏపీఎస్పీ 11వ బెటాలియన్ (కడప), ఏపీఎస్పీ 16వ బెటాలియన్ (విశాఖపట్నం), ఎన్‌సీసీ బాలురు, ఎన్‌సీసీ బాలికలు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీ, ఏపీ సైనికల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ బృందాలు పాల్గొననున్నాయి. బ్రాస్‌బ్యాండ్స్ విభాగంలో కర్నూలు, కాకినాడ, విజయనగరం, మంగళగిరి, వెంకటగిరి, కడప, అనంతపురం, విశాఖపట్నం ఏపీఎస్పీ బెటాలియన్లతో పాటు మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్స్ పైప్‌బ్యాండ్, ఎస్ఏఆర్ సీపీఎల్ హైదరాబాద్ యూనిట్ బ్రాస్, పైప్ బ్యాండ్స్ బృందాలు పాల్గొననున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు తదితరులు హాజరుకానున్నారు. (డీఐపీఆర్వో, ఐ అండ్ పీఆర్, ఎన్టీఆర్ జిల్లా వారి ద్వారా జారీ)




## నూతన వస్త్ర దుకాణం ఆకృతి .బృంద ప్రారంభం



రేపల్లె **ఆగస్టు 13 జనం రిపోర్టర్ :** స్థానిక బస్టాండ్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆకృతి బృందా వస్త్ర దుకాణాలను రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు రాష్ట్ర మంత్రి అనగానే సత్య ప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్టాండ్ దగ్గరలో ప్రజలందరికి అందుబాటులో ఉండే విధంగా వస్త్రాలు దానం ప్రారంభించడం అభినందనీయమన్నారు ప్రజలకు అవసరమైన వస్త్రాలు నాణ్యమైనవి తక్కువ ధరకు అందించి ప్రజల మన్నాళ్ళ పొందాలని వారుకోరేరు

# ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఆగష్టు 20వ తేది నుండి బీఎల్వో ల ద్వారా ఇంటింటి ఓటర్ జాబితా సర్వేకు సిద్ధం

## ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి. సృజన.



ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ,ఆగస్టు 13 జనం రిపోర్టర్ : ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ తయారీలో భాగంగా బీఎల్వోల ద్వారా ఇంటింటి ఓటర్ జాబితా సర్వే నిర్వహించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం అమరావతి నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్ఓలతో మంగళవారం సీఈవో వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ నుండి కలెక్టర్ డా.జి. సృజన, డిఆర్వో వి. శ్రీనివాసరావు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం. దుర్గాప్రసాద్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ లో వివేక్ యాదవ్ మాట్లాడుతూ 2025, జనవరి 1 అర్హత తేదీతో చేపట్టే ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు బీఎల్వోలు ఇంటింటి ఓటర్ల సర్వే ప్రక్రియ నిర్వహించాలన్నారు. అక్టోబర్ 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. అక్టోబర్ 29వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. సెప్టెంబర్ 29 నుంచి నవంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. అనంతరం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. డిసెంబర్ 24వ తేదీలోగా అభ్యంతరాలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కార కార్యక్రమం చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా 2025, జనవరి ఆరో తేదీన ప్రత్యేక సంక్షిప్త సవరణ తుది ఓటర్ల జాబితా ప్రచురించేందుకు చర్యలు తీసుకోవాలని సీఈవో వివేక్ యాదవ్ ఆదేశించారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి ఈ ఏడాది నవంబర్ 23న ముసాయిదా ఓటర్ల జాబితాను, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉన్నందున ఇందుకు సంబంధించిన కార్యకలాపాల షెడ్యూల్ పైనా మార్గనిర్దేశనం చేశారు. డీఐపీఆర్వో, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వారిచే జారీచేయడమైనది.

# హర్ ఘర్ తిరంగా అనువనువు కణం కణం భరతమాతకి సమర్పణం

## కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్




హసన్ పర్తి మండలం ఆగస్టు 13 జనం రిపోర్టర్ : భారత ప్రధాని నరేంద్ర మోదీ జీ పిలుపు మేరకు పంద్రాగస్టున త్రివర్ణ పతాకాన్ని ప్రతి ఇంట ఎగర వెయ్యాలని కోరుతూ హసన్పర్తి నగర వీధుల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లో భాగంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులతో ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులతో నగర ప్రముఖులతో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ నేతృత్వంలో ర్యాలీ కార్యక్రమం కొనసాగించి జాతీయ గీతాన్ని ఆలపించారు.దేశ స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వీరులని స్మరించుకొని ప్రతీ ఇంటిపైన జెండా ఎగరవేయాలనీ కార్పోరేటర్ గురుమూర్తి శివకుమార్ ర్యాలీ ప్రచారంలో మాట్లాడారు.ఈ ర్యాలీ లో హసన్పర్తి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల,జూనియర్ కళాశాల,సుజాత విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్,సెయింట్ మేరీస్ పాఠశాల,శ్రీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉపాధ్యాయులు,నగర ప్రముఖులు ర్యాలీ లో పాల్గొన్నారు.

# సీడ్స్ చైర్మన్ వేముల శ్రీనివాస్ రెడ్డికి ఘన సన్మానం



అమరచింత వనపర్తి జిల్లా ఆగస్టు 13 జనం రిపోర్టర్ : తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించడం జరిగింది. విత్తనభృతి రాష్ట్ర చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన అధిక దిగుబడి నిచ్చే విత్తనాలను రైతులకు సహ కాలంలో అందిస్తామని తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి అన్నారు. విత్తన అభివృద్ధి సంస్థ లో రైతులతో మంగళవారం సమావేశమయ్యారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో అన్ని వివిధ రకాల పంటలు 18 లక్షల ఎకరాలు సాగు అవుతున్నాయి. దాదాపు మూడు లక్షల ఎకరాలు వేరుశెనగ సాగు చేస్తున్నారు రైతుల కావాల్సిన విత్తనాలు సహకారంలో అందిస్తామని ఆయన అన్నారు.

**రైతులకు చెల్లించవలసిన నగదు ఆలస్యం కాకుండా చూసుకుంటామని చెప్పారు.**

రవి సీజన్ నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులకు తృణధాన్యాల విత్తనాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందూర్ నాగిరెడ్డి, జోగులాంబ గద్వాల జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎనుముల నాగరాజు, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి ఆత్మకూర్ పాండురంగం, అమరచింత కిసాన్ సెల్ అధ్యక్షుడు కా రెడ్డి లక్ష్మీకాంతరెడ్డి, వనపర్తి కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, పెద్దమందడి కిసాన్ సెల్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, రైతులు తదితరులు చైర్మన్ ను ఘనంగా సన్మానించారు.

# డి ఐ ఈవో అంజయ్యకు ఘన సన్మానం




అమరచింత వనపర్తి జిల్లా ఆగస్టు 13 జనం రిపోర్టర్ :వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారిగా బాధ్యతలు అంజయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యాపక సంఘం నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం శ్రీనివాసులు కవిత చంద్రశేఖర్ రెడ్డి సుహాసిని లావణ్య మరియు వెంకటేష్ అధ్యాపక బృందం శాలువాతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రానికి వచ్చిన తనకు ఇంత సత్కారాన్ని అందించిన జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులకు అంజయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యాభివృద్ధి కోసం ఉత్తీర్ణశాతం పెరగడం కోసం ఉపాధ్యాయ బృందం కృషి చేయాలని దీని కోసం తన వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తానని అంజయ్య ఉపాధ్యాయ బృందంతో అన్నారు.

# నార్పలలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



నార్పల ఆగస్టు 13 జనం రిపోర్టర్ : మండల కేంద్రంలో కస్తూరిబా బాలికల విద్యాలయం, బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో అధికారులు హర్ ఘర్ పర్ తిరంగా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ప్రధాన రహదారిలో ర్యాలీగా వచ్చి గాంధీ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు ఆగస్టు 15న ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ పతాకం రెపరెపలాడాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దేశ సమైక్యత, సమగ్రతలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుప్రియ, ఎంపీడీవో దివాకర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలప్ప, కస్తూరిబా బాలికల విద్యాలయం ఎస్ఓ నిర్మల, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, పిడి ఆంజనేయులు, పిఈటి నసీమా, తెలుగు పండిత్ నాగప్ప, లెక్కల మాస్టర్ చెన్నకేశవులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు, ఎఫ్ఎ శివకృష్ణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సర్పంచ్ ఎన్నికలలో పోటీకి సిద్ధం కండి...!

## సిపిఐ పార్టీ శ్రేణులకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి పిలుపు...




రామగుండం ఆగస్టు 13 జనం రిపోర్టర్ : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పెద్దపల్లి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం మంగళవారం సిరి ఫంక్షన్ హాల్ లో కామ్రేడ్ కడారి సునీల్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం కు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ నాయకులు మాజీ శాసనసభ ఫ్లోర్ లీడర్ కామ్రేడ్ చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేణి శంకర్, హాజరై పార్టీ శ్రేణులకు స్థానిక సంస్థల పోరుపై దిశ నిర్దేశం చేశారు.కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతకల్లాలను రెచ్చగొడుతూ, మతోన్మాదాన్ని, ఉసిగొలుపుతున్నదని ఇది దేశ సమగ్రతకు ఐక్యతకు భంగం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఎలాంటి అడ్డగోలు షరతులు, కండిషన్లు పెట్టి హామీల అమలుకు కండిషన్లను అడ్డుగా చూపెట్టరాదని రుణమాఫీ ఆగస్టు 15 లోగా రెండు లక్షల రూపాయలు పూర్తిగా ఎలాంటి కండిషన్లు, రేషన్ కార్డు లింక్ లేకుండా రైతుల పాస్బుక్ ఆధారంగా రైతుల రుణమాఫీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరుగున పడిపోయిన రైతుబంధును వెంటనే అమలు చేయాలని రైతుల పెట్టుబడులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. సెప్టెంబర్ మాసంలో జరగబోయే స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలలో పోటీకి పార్టీ శ్రేణులు అన్ని మండలాలు గ్రామాలలో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.రేషన్ కార్డులు వివిధ రకాల కారణాలతో కట్ చేసిన రేషన్ కార్డు అప్లై చేసుకున్న వారందరికీ వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ భూములు మాగాన్ని , చెలుక రకరకాల ఇబ్బందులు పెట్టొద్దని రేషన్ కార్డుకు గ్రామాలలో అర్హుల కాదా అని వెరిఫై చేస్తే సరిపోతుందని అన్నారు. హామీల అమలుకు అడ్డగోలు కండిషన్లు, కోరీలతో ప్రజలను ఇబ్బంది పెట్టాలని చూస్తే ప్రజల తిరుగుబాటు తప్పదని గత ప్రభుత్వాల మీద పోరాటాలు చేసిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మీద పోరాటాలు చేయవలసి వస్తుందని అన్నారు. ఈ కౌన్సిల్ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం జిల్లా వర్క్ రిపోర్ట్ పై సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి గోష్కమోహన్, కౌన్సిల్ మెంబర్స్ గౌతమ్ గోవర్ధన్, కే కనకరాజు టీమల్లయ్య , కోడం స్వామి ,గట్టయ్య ,రాజమౌళి, పసుల మల్లారెడ్డి ,ఆల శ్రీనివాస్ రెడ్డి, ఓదమ్మ, రమ, శంకర్, మానస్, ప్రీతం, టీ లక్ష్మణ్, సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జస్టిస్ కొండ మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 240 పాఠశాలలో విద్యార్థుల కోసం 8 స్వచ్ఛ ట్రక్కులు పంపిణీ..!!

-నేడు మర్పల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల టాయిలెట్స్ శుభ్రం చేసే స్వచ్ఛ్ ట్రక్కు ప్రారంభించేందుకు..!!

- ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి...!!

-తెలంగాణ అసెంబ్లీ శాసనసభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్..!!



వికారాబాద్ జిల్లా ఆగస్టు 13 జనం రిపోర్టర్ : చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 240 పాఠశాలలో విద్యార్థిని విద్యార్థుల కోసం 8 స్వచ్ఛ ట్రక్కులు ప్రతిరోజు టాయిలెట్స్ శుభ్రం చేస్తున్నాయి. రేపటి నుండి మర్పల్లి మండలంలో కూడా ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునే పిల్లల కోసం తొమ్మిదవ స్వచ్ఛ ట్రక్కు అందుబాటులోకి రానుంది. జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందుబాటులో ఉన్న నాయకులు కార్యకర్తలు అందరూ శ్రేయోభిలాషులతో సహా పాల్గొనాలని కోరుతున్నాము..

# ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత




వేటపాలెం ఆగస్టు 13 జనం రిపోర్టర్ :మండలంలోని పందిళ్ళపల్లి లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను వేటపాలెం ఎస్సై ఎం వెంకటేశ్వర్లు మంగళవారం పట్టుకున్నారు. వేటపాలెం ఎస్సైగా బాధ్యతలు చేపట్టి రెండు రోజులు పూర్తికాకుండానే ఇసుక అక్రమ రవాణా పై దృష్టి సారించడం జరిగింది. ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించే ప్రసక్తే లేదని, నిరంతరం ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు గస్తీ నిర్వహించడం జరుగుతుందని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. ట్రాక్టర్ డ్రైవర్ పై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

# 16నుండి రెవెన్యూ సదస్సులు




నార్పల ఆగస్టు 13 జనం రిపోర్టర్ : మండల వ్యాప్తంగా ఈనెల 16వ తేదీ నుండి గ్రామాల్లో రైతు సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు మండల తహసిల్దార్ కే. అరుణ కుమారి తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ పొలం సమస్యల్ని పరిష్కరించుకోవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ సదస్సుల్లో గ్రామాల్లో ఈనెల 16 నుండి వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. రెవెన్యూ అధికారులు సదస్సులో రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.16వ తేదీన బొందలవాడ, 17 వ తేదీన దుగుమరి, 20 తేదీన కేశేపల్లి, 21 తేదీన చామలూరు, 22 వ తేదీన నడిమిదొడ్డి,23వ తేదీన వెంకటాం పల్లి,24వ తేదీన శోధనపల్లి,27వ తేదీన గంగనపల్లి, 28 గూగూడు, 29,30,31 తేదీల్లో నార్పల, వచ్చే నెల 3వ తేదీన పులసలనూతల,4న బండ్లపల్లి, 5న దుర్గం, 6న సిద్ధరాచర్ల, 10వ తేదీన బి. పప్పూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు జరుగుతుందని, రెవెన్యూ సదస్సుల ద్వారా మండలంలోని రైతులు తమ సమస్యల్ని పరిష్కరించుకోవాలని మండల తహసిల్దార్ కె. అరుణ కుమారి కోరారు.

# ఎమ్మెల్యే బండారు శ్రావణి నీ మర్యాద పూర్వకంగా కలిసిన కొత్తగా ఎన్నికైన స్కూల్ చైర్మన్లు



నార్పల,, ఆగస్టు 13 జనం రిపోర్టర్ : మండల కేంద్రమైన నార్పల ఎస్సి కాలనీ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల చైర్మన్ పూజారి చైతన్య, గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాథమిక చైర్మన్ షేక్ వలి,జ్యోతిరావు పూలే బాలికల పాఠశాల చైర్మన్ రవి పులసలనూతుల చైర్మన్ రామంజి సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మా ఎన్నికలకు సహకరించిన టిడిపి ఎమ్మెల్యే బండారు శ్రావణి గారికి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు గారికి జిల్లా నాయకులు వెంకట నరసానాయుడు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.టీడీపీ కార్యాలయంలో పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణి మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి కి,విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పి ఎల్ లక్ష్మి నారాయణ, చంద్రబాబు,నడిమింటి రాము,గొల్లపల్లి దనుంజయ యాదవ్, ప్రసాద్,మహేష్,హరీష్,గణేష్,వడ్డే మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన కుటీర పరిశ్రమను సందర్శించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



బుట్టాయిగూడెం ఆగస్టు 13 జనం రిపోర్టర్ : ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం ఐటీడీఏ - కోట రామాచంద్రపురం... ఐటీడీఏ సాకారం తో స్థానిక గిరిజనులకు ఇచిన్న కుటీర పరిశ్రమను పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సందర్శించారు.. ఆర్గానిక్ గిరిజన సహజ సిద్ధంగా పండించిన జొన్నలు -రాగులతో తయారు చేసిన మల్టీగ్రేయన్ బిస్కెట్స్ పరిశీలించారు..అనంతరం వారికి ప్రోచాహాకంగా.. గవర్నమెంట్ ఇస్తున్న చిక్కికి బదులు ఇవి ఇస్తే మంచి ఆరోగ్యం తోపాటు ఈ పరిశ్రమ ద్వారా ఇంకా కొంతమందికి ఉపాధి ఉంటుంది అని తలచి... ఈ విషయం పై కలెక్టర్ దృష్టికి తీసుకునివెల్తన్నన్నారు.. అలాగే వర్షం వస్తే వారుపడుతున్న ఇబ్బంది గుర్తించి...వాటిని సరి చెయ్యాలని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడారు... ఈ సందర్శన లో . నీలయ్య మేనేజర్ ఏలూరు జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి పాదం కృష్ణ మండల ప్రెసిడెంట్ బుచ్చి రాజు , రాజు , కూటమి నాయకులు పాల్గొన్నారు...



# త్వరలో కరీంనగర్ జిల్లాకు పర్యావరణ మైన 70, ఎలక్ట్రికల్ బస్సులు....




రామగుండం ఆగస్టు 13 జనం రిపోర్టర్ : పర్యావరణహితమైన ఎలక్ట్రికల్ బస్సులు కరీంనగర్ జిల్లా కేంద్ర నుండి అతి త్వరలో రానున్నాయని కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత తెలిపారు ఈ సందర్భంగా పత్రిక ప్రకటనలో తెలియజేశారు. ఇందులో తొలిసారిగా 33 సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులోకి రానున్నాయని ఈ 33 బస్సులు కరీంనగర్ నుండి హైదరాబాదు రూట్ లో అద్దె ప్రతిపాదికన (జిసిసి-గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు నడపబడతాయని, వీటి పర్యవేక్షణ ఆపరేషన్స్ మొత్తం ఆర్టీసీఏ చూసుకుంటుందని అన్నారు. మిగతా 37 బస్సులు కరీంనగర్ నుండి జేబీఎస్ 6, కరీంనగర్ నుండి గోదావరిఖని కి 9, కరీంనగర్ నుండి మంథని 4, కరీంనగర్ నుండి కామారెడ్డి 6, కరీంనగర్ నుండి జగిత్యాల 6, కరీంనగర్ నుండి సిరిసిల్ల నాన్ స్టాప్ 6. ప్రస్తుతం వీటికి సంబంధించి అవసరమైన మౌలిక వసతులు ఏర్పాట్లు భాగంగా ఎలక్ట్రికల్ పనులు కొనసాగుతున్నాయని మౌలికవాసితులు ఏర్పాట్లు ప్రక్రియ పూర్తి అయిన తర్వాత అతి త్వరలో ఈ ఎలక్ట్రికల్ సూపర్ లగ్జరీ బస్సులు రోడ్డు ఎక్క నున్నాయని తెలిపారు.

# రుక్మాపూర్ పాఠశాలలో యూనిఫామ్స్ పంపిణీ



చొప్పదండి,ఆగస్టు 13 జనం రిపోర్టర్ : చొప్పదండి మండలంలోని జెడ్పిఎస్ఎస్ రుక్మాపూర్ పాఠశాలలో రెండవ దశ దుస్తుల పంపిణీ చేయడం జరిగింది.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి శ్రీధర్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు విద్యార్థులు ప్రతిరోజు ప్రభుత్వం పంపిణీ చేసిన యూనిఫామ్స్ ధరించి పాఠశాలకు రావాలని మరియు యూనిఫాం దుస్తులను శుభ్రపరచుకొని ధరించాలని విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్.సురేందర్,జి.శ్రీవాణి,ఎం శారద,ఎస్. అంజయ్య, డి.మల్లికార్జున్, ఎస్.ఉమాదేవి,సి ఆర్ పి సురేందర్,విద్యార్థులు పాల్గొన్నారు.

# కోట్ పల్లి మండల కేంద్రంలో నూతన తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ లాజిస్టిక్ కౌంటర్ ప్రారంభం..!!




వికారాబాద్ జిల్లా ఆగస్టు 13 జనం రిపోర్టర్ : కోట్ పల్లి మండల మరియు మండల కేంద్రంలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు శుభవార్త. మండల కేంద్రంలోని కోట్ పల్లి బస్టాండ్ సమీపంలో కౌంటర్ అధికారులు ప్రారంభించారు.. కౌంటర్ ఏజెంట్ గా భాశెట్టి ని నియమించినట్లు రంగారెడ్డి నల్లగొండ లాజిస్టిక్ అధికారి రవీందర్ ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు భాను ప్రసాద్, చంద్రయ్య తాండూర్ డిపో, విశ్వనాథ్ గౌడ్ పరిగి డిపో, వసంత్ వికారాబాద్ డిపో అధికారులు పాల్గొని ఈ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు..ఈ కార్యక్రమంలో కోట్ పల్లి మండల ప్రజా ప్రతినిధులు, వ్యాపారస్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని, ఇలాంటి సౌకర్యాన్ని కల్పించినందుకు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.. ఈ సందర్భంగా వికారాబాద్ డిపో మేనేజర్ అరుణ మాట్లాడుతూ మోమిన్ పేట్ మరియు మర్పల్లి మండల కేంద్రంలో లాజిస్టిక్ కౌంటర్ నిర్వహించడానికి ఆసక్తి గల వారు రంగారెడ్డి రీజియన్ సేల్స్ టీమ్ లీడర్స్ వసంత్ గౌడ్ మరియు విశ్వనాధ్ గౌడ్ లను సంప్రదించాలని సూచించారు. నూతన ఏజెంట్ పొందడానికి సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ 9154298738 9154298740 కాల్ చేసి సంప్రదించాలనిఅన్నారు.

# కావేటి పరమేశ్వర్ గురుస్వామికి "అయ్యప్ప సేవా రత్న" అవార్డు ప్రధానం



కరీంనగర్ బ్యూరో,ఆగస్టు 13 జనం రిపోర్టర్ : కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన కావేటి పరమేశ్వర్ గురు స్వామికి అయ్యప్ప సేవా రత్న అవార్డును ప్రధానం చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురంలో జరిగిన "అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ" జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 18 మంది గురుస్వాములకు అయ్యప్ప సేవా రత్న అవార్డులను అందించారు. ఫౌండర్, మేనేజింగ్ ఫౌండర్ ట్రస్టీ పి.ఎన్.కే మీనన్, అధ్యక్షుడు అయ్యప్ప దాస్, ప్రధాన కార్యదర్శి బేతి తిరుమలరావు ఆధ్వర్యంలో శబరిమల అయ్యప్ప దేవాలయ మాజీ మేల్ శాంతులు శశికుమార్, దామోదరన్ నంబూద్రీ అయ్యప్ప సేవా రత్న అవార్డును కావేటి పరమేశ్వర్ స్వామికి అందించారు. ఈ సందర్భంగా కావేటి పరమేశ్వర్ గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి అనుగ్రహంతో కరీంనగర్ జిల్లాలో అయ్యప్ప మాలధారణ చేసే స్వాములు, అయ్యప్ప సేవ సమితి సభ్యుల ఆశీస్సులు, సహకారంతోనే ఈ అవార్డు లభించిందన్నారు. అవార్డు రావడం సంతోషకరంగా ఉందని, ముఖ్యంగా ఈ అవార్డును జీవిత భాగస్వామి కావేటి శైలజ, కరీంనగర్ అయ్యప్ప భక్తులకు అంకితమిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. నిరంతర అయ్యప్ప స్వామి నామస్మరణతో మరింతగా అయ్యప్పకు సేవ చేసుకోవడానికి, మాల ధారణ చేపట్టే అయ్యప్పలకు తగిన తోడ్పాటును అందించడానికి, సేవ చేయడానికి తగిన కృషి చేస్తానని గురుస్వామి కావేటి పరమేశ్వర్ ఈ సందర్భంగా తెలిపారు. తన సేవను గుర్తించి అవార్డును అందించిన కమిటీకి, సీనియర్ గురుస్వాములకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# నవాబ్ పేట (బంద్) మండల కేంద్రంలో నిరసిస్తూ నిరసన సెగలు..!!



వికారాబాద్ జిల్లా ఆగస్టు 13 జనం రిపోర్టర్ : బంగ్లాదేశ్లో జరుగుతున్న మైనారిటీ, హిందువులపై హిందువుల ఇళ్లపై, దాడులను నిరసిస్తూ ఈరోజు నవాబ్ పేట మండల కేంద్రంలో హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించిన బిజెపి నవాబుపేట మండలం ఇన్చార్జి సోమ నొల్ల రామకృష్ణారెడ్డి, వడ్ల నర్సింలు, నవాబుపేట్ లక్ష్మణ్, బండయ్య గౌడ్, చంద్రశేఖర్, నవాబుపేట మండల పరిధిలోని వివిధ గ్రామాల నాయకులు చేపట్టడం జరిగింది దీనికి సంబంధించి మండల కేంద్రంలో ఉన్న అన్ని వ్యాపార సముదాయాలను స్వచ్ఛందంగా బందును పాటించి వారి మద్దతును తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల యువత మరియు పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఐ అరుణ్ కుమార్ ను కలిసిన బీజేవైఎం సెక్రెటరీ, గుబ్బడి పతేపూర్ గ్రామస్తులు.




వికారాబాద్ జిల్లా ఆగస్టు 13 జనం రిపోర్టర్ : వికారాబాద్ జిల్లా పరిధిలోని నవాబుపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించిన ఎస్ఐ భరత్ భూషణ్ బదిలీపై వెళ్లడంతో నూతన ఎస్ఐ గా వచ్చిన కె అరుణ్ కుమార్ ను నవాబుపేట్ మండల బీజేవైఎం సెక్రటరీ రావులపల్లి హరికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. రావులపల్లి హరికృష్ణ మరియు రావులపల్లి సుధాకర్ శాలువాతో సత్కరించి స్వాగతం తెలిపారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట్ బిజెపి మండల మాజీ కార్యదర్శి రావులపల్లి సుధాకర్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ లేకపోతే ప్రజలు తిరగబడతారని భయపడుతున్నాడేమో... జగన్ పై హెూం మంత్రి అనిత సెటైర్లు..



అమరావతి,: మాజీ సీఎం వైఎస్ జగన్ భద్రతను ఎవరూ తొలగించలేదని ఏపీ హెూం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. జగన్ అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. సెక్యూరిటీ లేకపోతే ప్రజలు తిరగబడతారని భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. రూల్స్ ప్రకారం మాజీ ముఖ్యమంత్రికి ఇవ్వాల్సిన భద్రత కల్పించామని చెప్పారు.రాష్ట్రంలో 20వేల మంది పోలీసుల కొరత ఉంటే ఆయనకు 900 మంది సెక్యూరిటీ కావాలా అని మండిపడ్డారు. రాజమండ్రి సెంట్రల్ జైలును హెూంమంత్రి వంగలపూడి అనిత సోమవారం పరిశీలించారు. జైలు ఆధ్వర్యంలో పెట్రోలు బంక్‌ను ప్రారంభించిన అనంతరం.. సెంట్రల్ జైలులో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్నేహ బ్లాక్ వద్దకు వెళ్లాక హెూం మంత్రి భావోద్వేగానికి గురయ్యారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును జైలుకు పంపించడాన్ని ఆమె గుర్తుకు తెచ్చుకున్నారు. తమ నాయకుడిని 53 రోజులు అన్యాయంగా జైల్లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రోజులు గుర్తుకువచ్చి బాధగా అనిపిస్తుందని అన్నారు. వైసీపీ పాలనలో అక్రమ కేసులకు చంద్రబాబు కూడా బాధితుడిగా మారారని పేర్కొన్నారు. అక్రమ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు పాతాళానికి పడిపోయాయని తెలిపారు. వాళ్ల పాపాలు పండాయని.. అందుకే జన నాయకుడిని బాధపెట్టిన వైసీపీని పాతాళానికి తొక్కేలా ప్రజలు బలమైన తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో సెంట్రల్ జైలులో సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని వంగలపూడి అనిత తెలిపారు. జైలు సిబ్బందికి ఆరోగ్య భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. పోలీసు సిబ్బంది తరహాలో తమకు కూడా ఈఎల్స్ కావాలని జైలు సిబ్బంది అడిగారని.. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. సెంట్రల్ జైలులో డీఅడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను కూడా ప్రభుత్వానికి విన్నవిస్తానని అన్నారు. అలాగే ఖైదీలకు క్షమాభిక్షను కూడా తిరిగి తీసుకొస్తామని చెప్పారు.

## త్వరలో పోలీస్ శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీ: డీజీపీ ద్వారకా తిరుమల రావు



అమరావతి : గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేసేందుకు కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకోబోతోంది. ఈ క్రమంలో సర్కార్ నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. త్వరలోనే పోలీస్ శాఖలో భారీ ఎత్తున కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేపట్టబోతున్నట్లు డీజీపీ ద్వారకా తిరుమల రావు వెల్లడించారు. ఇవాళ రాయలసీమ జిల్లాల ఎస్పీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అడ్డుకట్ట వేసేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా యువతను చిదిమేస్తున్న గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు ఫోకస్ పెట్టాలని ఆదేశించారు.

## అది పద్ధతి కాదు... టిడిపి పోటీకి రాకూడదు... బొత్స



విశాఖ: విశాఖ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా నేడు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో విజయం తమదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తమకు పూర్తి మెజార్టీ ఉందని, టీడీపీ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తుందని తాను అనుకోవడం లేదన్నారాయన. ఒకవేళ టీడీపీ అభ్యర్థిని బరిలో దింపితే అది దుశ్చర్యేనని తేల్చి చెప్పారు. టీడీపీ పోటీకి రావడం పద్ధతి కాదన్నారు. మెజార్టీ లేనప్పుడు గతంలో తాము పోటీకి రాలేదని, ఇప్పుడు టీడీపీ కూడా ప్రజాస్వామ్య విలువలను కాపాడాలన్నారు బొత్స. వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స నామినేషన్ దాఖలు చేసినా, టీడీపీ ఇంకా అభ్యర్థిని ఖరారు చేయకపోవడం విశేషం. నామినేషన్ దాఖలుకు రేపే ఆఖరు. అయినా టీడీపీ ఇంకా చర్చల్లోనే ఉంది. పేరు ఖరారైందని వార్తలొస్తున్నా అది అధికారికం కాదు. ఒకవేళ పోటీ చేసి ఓడిపోతే పరువు పోతుందని ఆ పార్టీ ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే వైసీపీకి చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులందర్నీ క్యాంప్ లకు తరలించారు. టీడీపీ కూడా అభ్యర్థిని నిలబెడితే ఈనెల 30న పోలింగ్ జరుగుతుంది. బొత్స ఒక్కరే అభ్యర్థి అయితే మాత్రం ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చిన రెండు నెలల గ్యాప్ లో జరుగుతున్న విశాఖ ఎమ్మెల్సీ ఎన్నికలు అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షానికి ప్రతిష్టాత్మకంగా మారాయి. వాస్తవానికి ఇక్కడ వైసీపీకే క్లియర్ మెజార్టీ ఉంది. కానీ స్థానిక ప్రజా ప్రతినిధుల్ని తనవైపు తిప్పుకోవాలని టీడీపీ భావిస్తోంది. ఎలాగైనా ఆ స్థానం కైవసం చేసుకోవాలనుకుంటోంది. సీనియర్ నేత బొత్సను అభ్యర్థిగా ప్రకటించి జగన్ తెలివైన స్టెప్ వేశారు. ఆ ఎత్తుకి ఫలితం ఉంటుందో లేదో త్వరలో తేలిపోతుంది.

## ముహూర్తం పెట్టిన చంద్రబాబు: పండగ వాతావరణం లో

దివంగత ముఖ్యమంత్రి జయలలిత దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అయిదు రూపాయలకు ఉదయం టిఫిన్, 10 రూపాయలకు మధ్యాహ్నం, రాత్రి వేళ భోజనాన్ని అందించాలనే ఉద్దేశంతో అమ్మ క్యాంటీన్లు పేరుతో వాటిని ఏర్పాటు చేసింది అప్పట్లో. దీన్ని 2018లో చంద్రబాబు ప్రభుత్వం ఏపీలో అమలు చేసింది. 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం వల్ల అవి మూతపడ్డాయి. దీన్ని పునరుద్ధరిస్తామని తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. దీనికి అనుగుణంగా అన్నా క్యాంటీన్లు రాష్ట్రంలో ఏర్పాటు కానున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వాటికి ముహూర్తం పెట్టారు.

## బంగ్లాదేశ్లో హింస వేళ షేక్ హసీనా భారత్ ఆశ్రయం ఇవ్వకపోయి ఉంటే...శశి థరూర్



న్యూఢిల్లీ,: బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనల వల్ల ఆ దేశ ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత షేక్ హసీనాకు భారత్‌లో ఆశ్రయం ఇచ్చినందుకు కేంద్రాన్ని ప్రశంసించారు కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్. షేక్ హసీనా రాజీనామా చేసిన తర్వాత ఆమెకు భారత్ సాయం చేయకపోతే అది మన దేశానికే అవమానకరమని చెప్పారు. మన మిత్రులతో మనం చెడుగా ప్రవర్తిస్తే ఇకపై ఎవరూ మనకు మిత్రులు కావాలని కోరుకోరని షేక్ హసీనా చెప్పారు. షేక్ హసీనా భారత్‌కు మిత్రురాలని తెలిపారు. మిత్రులు ఇబ్బందుల్లో ఉంటే వారికి సాయం చేసే విషయంలో మరో ఆలోచనలేవీ పెట్టుకోవద్దని చెప్పారు. ఆమెను ఇక్కడికి తీసుకువచ్చి, భద్రత కల్పించి భారత ప్రభుత్వం సరైన పని చేసిందని అన్నారు. అలాగే, బంగ్లాదేశ్‌లో అధికార మార్పిడి భారతదేశానికి కూడా మొదట ఆందోళన కలిగించదని చెప్పారు. బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు భారత్‌తో ఆ దేశ సంబంధాలను ఎలా ప్రభావితం చేస్తాయనే దానిపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో శశి థరూర్ తన అభిప్రాయాలు తెలిపారు. బంగ్లాదేశ్‌తో సత్సంబంధాలు కొనసాగించడానికే భారత్ ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.

### మొదటి నుంచి మద్దతుగా భారత్

బంగ్లాదేశ్‌కు భారత్ మొదటి నుంచి మద్దతు తెలుపుతోందని, 1971 యుద్ధం సమయంలోనూ మద్దతు తెలిపామని అన్నారు. కొన్ని సార్లు బంగ్లాదేశ్‌లో భారత స్నేహపూర్వక ప్రభుత్వం లేకపోయినప్పటికీ మనం మాత్రం సత్సంబంధాలను కొనసాగించామని తెలిపారు. రాబోయే కాలంలోనూ ఈ బంధాన్ని కొనసాగించడంలో ఎలాంటి లోటుపాట్లు ఉండబోవని చెప్పారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, గ్రామీణ బ్యాంక్ వ్యవస్థాపకుడు ముహమ్మద్ యూనస్ నేతృత్వంలో బంగ్లాదేశ్‌లో ఏర్పడిన మధ్యంతర ప్రభుత్వంపై భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శశి థరూర్ అన్నారు. తనకు వ్యక్తిగతంగా మహమ్మద్ యూనస్ తెలుసని తెలిపారు. ఆయన అత్యంత గౌరవనీయమైన వ్యక్తి అని, ఆయన జమాత్ ఇ ఇస్లామీ, పాకిస్థానీ ఐఎస్ఐతో సత్సంబంధాలు కొనసాగించడం కంటే అమెరికాతో సత్సంబంధాలకే కాస్త మొగ్గు చూపుతారని తాను అనుకుంటున్నట్లు చెప్పారు.

# వెంకయ్య నాయుడు సూచనలు చంద్రబాబు అమలు చేస్తారా?



అమరావతి, : మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు చేసారు. పోలీసు స్టేషన్లపై, రెవెన్యూ కార్యాలయంపై పెత్తనం కాకుండా అభివృద్ధిపై నేతలు దృష్టి ఉండాలని హితవు పలికారు. ఏపీలో తాజా ఎన్నికల ఫలితాల పైన స్పందించారు. అదే సమయంలో ఉచిత పథకాల పైన వెంకయ్య కీలక సూచనలు చేసారు. ప్రజా జీవితంలో సిద్ధాంతాలు, విలువలు, సంప్రదాయాలను గౌరవించాలని పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రజాప్రతినిధులకు ఉద్బోధించారు.

ప్రతికూల పరిస్థితుల్లో

వెంకయ్యనాయుడు తాను చిన్నతనం నుంచి ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా వాటిని అవకాశాలుగా మలచుకుంటూ ముందడుగు వేశానని చెప్పారు. చిన్నతనంలోనే తన తల్లి చనిపోవడం ఒక్కటే తనకు తీరని వెలితి తప్ప ఇంతవరకు ఎందులోనూ తనకు అసంతృప్తి లేదన్నారు. న్యాయవాది కావాలనే తన తల్లి ఆలోచనకు అనుణంగా లా చదివినాని చెప్పారు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ కారణంగా జైలుకు వెళ్లి న్యాయవాద వృత్తిలో ప్రాక్టీస్ చేయలేకపోయానని చెప్పారు.

### మార్పు రావాలి

ప్రజాప్రతినిధుల ఆలోచనల్లో మార్పులు రావాలని, చట్టసభల్లో మాట్లాడేటప్పుడు మంచి భాష ఉపయోగించాలని సూచించారు. రాజ్యసభ ఛైర్మన్‌ను సైతం ధిక్కరించి కొందరి సభ్యుల ప్రవర్తనపై సునిశితంగా స్పందించారు. సంప్రదాయాలు, ఉత్తమ సంస్కారం అనివార్యమన్నారు. రాష్ట్రంలోనూ ఆ పద్ధతి పాటించకుండా బూతులు మాట్లాడిన వారికి ఇటీవలి ఎన్నికల్లో తగిన గుణపాఠం ఎదురైందన్నారు. పార్టీలు వేరైనా అంతా ప్రత్యర్థులమే తప్ప శత్రువులు కాదనే భావన ఉండాలన్నారు.

### ఫ్రీగా ఇవ్వకపోయినా

ప్రజలకు వైద్యం, చదువు ఉచితంగా అందిస్తే సరిపోతుందని వెంకయ్యనాయుడు అన్నారు. మిగతావి ఫ్రీగా ఇవ్వకపోయిన పర్వాలేదని చెప్పారు. తద్వారా దేశం, రాష్ట్రాలు బాగుపడుతాయని తాను భావిస్తున్నట్లు వెల్లడించారు. పథకాలు ఉచితంగా ఇచ్చే బదులు ప్రజలకు పనిలో శిక్షణ ఇవ్వాలని వివరించారు. ఫలితంగా వారు ఉపాధి పొందుతారని వెంకయ్యనాయుడు వెల్లడించారు. ఏపీలో ఉచిత పథకాల పైన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు..కూటమి ప్రభుత్వం అమలు పై చర్చ జరుగుతున్న వేళ వెంకయ్య వ్యాఖ్యల ప్రభావం చంద్రబాబు పాలనలో ఏ మేరకు ఉంటుందనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# నాందేడ్ నుంచి శ్రీకాకుళం వరకు రెండు స్పెషల్ ట్రైన్లు... ప్రయాణికులకు శుభవార్త



శ్రీకాకుళం, : రైలు ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఓ శుభవార్తను అందించారు. నాందేడ్ నుంచి శ్రీకాకుళం వరకు రెండు స్పెషల్ ట్రైన్లను నడపనున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రయాణికుల రద్దీనీ గమనంలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక ప్రకటన చేసింది. పలు స్పెషల్ ట్రైన్లు నడింపేందుకు సిద్ధమయ్యింది. ఈ ట్రైన్లు నాందేడ్ నుంచి శ్రీకాకుళం రోడ్ వరకూ నడవనున్నాయి. ఈ మేరకు స్పెషల్ ట్రైన్స్‌పై దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటన కూడా జారీ చేసింది. రండి వాటి పూర్తి వివరాలేంటో తెలుసుకుందాం.

### స్పెషల్ ట్రైన్స్..

07487 అనే నెంబర్‌గల స్పెషల్ ట్రైన్ ఆగస్ట్ 14వ తేదిన నాందేడ్ నుంచి శ్రీకాకుళం రోడ్?కు నడవనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ స్పెషల్ ట్రైన్ బుధవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో నాందేడ్ నుంచి బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12గంటలకు శ్రీకాకుళం రోడ్‌కు చేరుకుంటుందని అధికారులు వివరించారు. 07488 అనే నెంబర్‌గల స్పెషల్ ట్రైన్ ఆగస్ట15వ తేది గురువారం సాయంత్రం ఐదు గంటల సయమంలో నాందేడ్‌లో బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.25గంటల సమయానికి నాందేడ్‌కు చేరుకుంటుంది.

### జనరల్ క్లాస్ బోగీలు ఉండవు..

ఇక, ఇదే స్పెషల్ ట్రైన్ గురువారం సాయంత్రం ఐదు గంటలకు శ్రీకాకుళం రోడ్ నుంచి నాందేడ్‌కు బయలుదేరుతోంది. అక్కడి నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం అంటే ఆగస్ట్ 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల ఇరవై ఐదు నిమిషాల సమయానికి నాందేడ్ చేరుకుంటుందని అధికారులు వివరించారు. ఈ స్పెషల్ ట్రైన్స్‌లో జనరల్ క్లాస్ బోగీలు ఉండవని దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఇందులో కేవలం థర్డ్ ఏసీ, స్లీపర్ కోచ్‌లు మాత్రమే ఉంటాయి. ఇందులో మాత్రమే ప్రయాణించాల్సి ఉంటుంది.

### ఈ స్టేషన్ల మీదుగా రాకపోకలు..

అంతేకాదు, ఈ స్పెషల్ ట్రైన్స్ పలు స్టేషన్ల మీద రాకపోకలు సాగిస్తాయి. అవి ముద్కేడ్, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, సింహాచలం నార్త్, కామారెడ్డి, సికింద్రాబాద్, ధర్మాబాద్, బాసర, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిజామాబాద్, గుంటూరు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్ల మీదుగా ఈ స్పెషల్ ట్రైన్లు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. ఈ విషయాన్ని ప్రయాణికులకు గమనించగలరని అధికారులు కోరుతున్నారు.

### వరుస సెలవులు..

ఇదిలా ఉంటే.. ఈనెలలో వరుస సెలవులు వస్తున్నాయి. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సెలవు రావడంతో రైళ్లలో ప్రయాణికుల రద్దీనీ గమనంలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆగస్ట్ 15తో పాటుగా ఆ మరుసటి రోజు అంటే ఆగస్టు 16 వరలక్ష్మీ వ్రతం రావడంతో రెండు రోజులు వరుస సెలవులు రానున్నాయి. దీంతో పాటు ఆగస్టు 18వ తేది ఆదివారం సాధారణ సెలవు. ఆగస్టు 19వ తేదీ రాఖీ పర్వదినం సందర్భంగా వరుస సెలవులు రానున్నాయి. దీంతో సొంత ఊర్లకు వెళ్లేవారి సంఖ్య, ట్రిప్‌లకు వెళ్లేవారి సంఖ్య అధికంగా ఉంటుందని అధికారుల అంచనా. ఈ నేపథ్యంలోనే ప్రయాణికులకు ఎటువంటి సమస్యలు రాకుండా పలు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ప్రయాణికులు దృష్టిలో ఉంచుకోవాల్సిందిగా అధికారులు కోరారు.

## భారత అంతరిక్ష రంగ పితామహుడి జీవితం స్ఫూర్తిదాయకం: డిప్యూటీ సీఎం పవన్

ఒక శాస్త్రవేత్త దేశం గురించితన చుట్టూ ఉన్న సమాజం గురించి ఆలోచన చేస్తే ఎంతటి గొప్ప ఫలితాలు వస్తాయో దివంగత విక్రమ్ సారాభాయ్ గారి జీవితాన్ని పరిశీలిస్తే తెలుస్తుందని పవన్ చెప్పుకొచ్చారు. తిక



శాస్త్ర పరిశోధనాలయం ఏర్పాటు చేయడం, మన దేశానికి శాటిలైట్ ఆవశ్యకత గురించి నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ గారిని ఒప్పించడం, ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ నెలకొల్పడం ద్వారా దేశంలో అంతరిక్ష రంగం అభివృద్ధి చెందిందన్నారు. . మన దేశం అంతర్జాతీయంగా అర్ధవంతమైన పాత్ర పోషించగలగాలంటే, ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని మానవ సమాజ సమస్యల పరిష్కారానికి ఉపయోగించుకోవడంలో మనం ఎవరికీ తీసిపోకుండా ఉండాలని చెప్పిన విక్రమ్ సారాబాయ్ మాటలు నవతరం శాస్త్రవేత్తలు ఆచరణలో చూపాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

## తీర్పు ముందు.. పీటీ ఉష తీర్పు నెటిజన్ల సీరియస్



న్యూఢిల్లీ, : వినేశ్ ఫోగట్ తనకు జరిగిన అన్యాయంపై న్యాయం కోసం పోరాడుతోంది. ఒకవైపు ఆ తీర్పుని రిజర్వ్ చేశారు. 13వ తేదీని తుది తీర్పు ప్రకటిస్తామని తెలిపారు. ఇంతలో ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పీటీ ఉష తగుదునమ్మా అంటూ సీన్ లోకి వచ్చి, నోటికొచ్చినట్టు మాట్లాడింది. దీంతో ఈమె మాటలు ఏమైనా తీర్పుపై ప్రభావం చూపించే అవకాశాలున్నాయా? అని నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరి పని వాళ్లు చేయకుండా, పేనుకు పెత్తనం ఇస్తే, జుత్తంతా గొరికిందన్నట్టు పీటీ ఉషకు పెద్ద బాధ్యతలు అప్పగిస్తే, మన క్రీడాకారుల వైపు మాట్లాడాల్సింది పోయి, ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం ఏమిటి? అని మండిపడుతున్నారు. ఇలాంటి సమయంలో ఇలాగేనా మాట్లాడాల్సింది. ఒక బాధ్యతగల పదవిలో ఉండి, తనిలా మాట్లాడటం సరైంది కాదని అంటున్నారు. ఇంతకీ పీటీ ఉష ఏమన్నాదంటే.. రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్, జూడోలాంటి వాటిలో తన బరువు నియంత్రణలో ఉంచుకునే బాధ్యత మొత్తం అథ్లెట్ దే అవుతుందని, అది చూడాల్సిన బాధ్యత కోచ్ పై ఉందని ఆమె అనడం గమనార్హం. ఇదే మాటలు తీర్పు చెప్పేవారు వింటే, పరిస్థితి ఎలా ఉంటుందని నెటిజన్లు సీరియస్ అవుతున్నారు. ఇంకా తనేమన్నాదంటే.. అందరూ ఇండియన్ ఒలింపిక్ మెడికల్ టీమ్ ని నిందిస్తున్నారు. వారు ఆటగాళ్లకు గాయాలైతే కట్లు కడతారు కానీ, అందరి బరువు చూసి, వారికి గైడ్ చేయరని తెలిపింది. 117 మంది ఆటగాళ్ల బరువు చూడటం వారి బాధ్యత కాదని తెలిపింది. ఆ బాధ్యత సంబంధిత కోచ్, ఆ అథ్లెట్ సపోర్ట్ టీమ్ దేనని కుండ బద్దలు కొట్టినట్టు తెలిపింది. ఐఓఏ మెడికల్ టీమ్, ముఖ్యంగా డాక్టర్ పర్దీవాలాను లక్ష్యంగా చేసుకొని చేస్తున్న విమర్శలు సరికావు. వీటిని ఖండిస్తున్నాను" అని పీటీ ఉష స్పష్టం చేసింది. నువ్వు ఖండిస్తే ఖండించావు నిన్నెవరూ ఖండించవద్దని అనలేదు కదా.. అదేదో తీర్పు చెప్పాక చెబితే బాగుండేది కదా.. అని నెటిజన్లు పీటీ ఉషపై అంతెత్తున లేస్తున్నారు. భారతదేశమంతా మన రెజ్లర్ కి అన్యాయం జరిగిందంటే.. నువ్వు ఒక్కరు మాత్రం వెరైటీగా మాట్లాడుతున్నావని మండిపడుతున్నారు. మరేం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

## శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో' "అంతర్జాతీయ యువ దినోత్సవం"




విజయనగరం, : శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువ దినోత్సవాన్ని సోమవారం ఉదయం స్థానిక అయ్యన్న పేట జంక్షన్ వద్ద నున్న క్లబ్ నడక మైదానంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా అంతర్జాతీయ మాస్టర్స్ థాయిలాండ్ అథెలిటిక్స్ పోటీల్లో.. పోల్ వాల్ట్ విభాగంలో బంగారు పతకం సాధించిన యువ క్రీడాకారులు,ఎ. ఆర్. కానిస్టేబుల్ పున్నపురెడ్డి సన్యాసి నాయుడు (పోలీస్ నాయుడు) కు క్లబ్ పెద్దలంతా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘసేవకులు, క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశరావు మాస్టారు మాట్లాడుతూ యువత దేశానికి వెన్నుముకని, యువతంతా వారివారి రంగాలలో ప్రతిభా నైపుణ్యాలతో రాణించడం వలన దేశ ప్రగతికి సోపానాలని,కష్టపడి పనిచేస్తే సాధ్యం కానిది ఏదీలేదని, గ్రామీణ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయిలో దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టిన పున్నపురెడ్డి సన్యాసి నాయుడు ను యువతీయువకులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం సన్మాన గ్రహీత, యువ క్రీడాకారులు, కానిస్టేబుల్ నాయుడు మాట్లాడుతూ.. ఇటువంటి సత్కారాలు జీవితంలో మరింత ముందుకెళ్ళటానికి రెట్టింపు ఉత్సాహన్ని ఇస్తాయని, యువత అంతా ద్విచక్ర వాహనాలు తగ్గించుకొని, పుస్తక పఠనం, వ్యాయామం, క్రీడలు వైపు దృష్టి సాధించాలని, 2023-24సంవత్సరం లో భారతదేశం మొత్తం మీద ఒక్క ఆంధ్రప్రదేశ్ లోనే వాహన ప్రమాదాల్లో ఎక్కువ శాతం చనిపోయింది యువతే అని, దాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా సూపరేండెంట్ అఫ్ పోలీస్ వకుల్ జిందల్ వారు రాత్రి పదకుండు తరువాత ఏ షాప్ లు ఉండకూడదని, సన్మార్గంలో నడాల్సిన యువత రాత్రుళ్ళు తిరగకూడదని నిబంధనలు పెట్టడం ఒక పౌరుడుగా అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ సలహాదారులు ఎ. తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు వల్లూరి శ్రీను,క్లబ్ కార్యదర్శి ఐ.వి. ప్రసాదరావు, కోశాధికారి ఆర్.సి.హెచ్. అప్పలనాయుడు, జాలీవాకర్ కిలారి గివింద్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా మెడికల్ క్యాంప్ మరియు బ్లడ్ క్యాంప్ కార్యక్రమ ప్రారంభోత్సవానికి బొబ్బిలి ఏంఎల్ఏ "బేబీనాయన"కు ఆహ్వానం అందజేత



బొబ్బిలి,: ఆగస్టు 16న బొబ్బిలిలో జరగనున్న సిఆర్పిఎస్ ఉత్తరాంధ్ర నాయకుల సమావేశానికి,అదేవిధంగా మెగా మెడికల్ క్యాంప్ మరియు మెగా బ్లడ్ క్యాంప్ కార్యక్రమ ప్రారంభోత్సవానికి బొబ్బిలి శాసనసభ్యులు, బొబ్బిలి పులి ఆర్ వి ఎస్ కే కే రంగారావు (బేబీ నాయన)కి ఆహ్వాన పత్రాన్ని అందించడం జరిగింది.కార్యక్రమం యొక్క వివరాలను సీనియర్ పాత్రికేయులు,సిఆర్పిఎస్ మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షులు పొట్నూరు రాజ్ కిరణ్ వివరించారు.కార్యక్రమం విజయవంతం అవ్వడానికి తాను తప్పకుండా సహకరిస్తానని బేబీనాయన తెలియజేశారు.

# సీఎం రేవంత్ రెడ్డి పై బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సంచలన వ్యాఖ్యలు



సీఎం రేవంత్ రెడ్డి చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. తాజాగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఏమీ చేయలేదని ప్రతి పక్షం లో కూర్చో పెట్టారు. రేవంత్ సర్కార్ ఏమీ చేస్తామో చెప్పకుండా గత ప్రభుత్వం నీ విమర్శించడం పనిగా పెట్టుకుంది. విధ్వంసం, అప్పుల పాలు అయిన తెలంగాణ లో 31 వేల కోట్ల రుణమాఫీ ఎలా జరుగుతుంది.. లక్ష 50 వేల కోట్ల తో మూసి ప్రక్షాళన ఎలా అవుతుంది. అక్బరుద్దీన్ ఓవైసీ కి 300 కోట్లు ఎలా ఇస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏమీ ఇవ్వలేదో చెప్పమని అడిగితే చెప్పరు. అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడితే సినిమా చూసినట్టు చూస్తారు. బీజేపీ కి టైమ్ ఇవ్వమంటే ఇవ్వరు. అసెంబ్లీ లో బూతు పురాణం మాట్లాడుతున్నారు. అప్పుడే అప్పులు అంటాడు, అప్పుడే శంకుస్థాపనలు అంటాడు రేవంత్ రెడ్డీ.రిటైర్డ్ అధికారులతో రాష్ట్రాన్ని నడిపిస్తున్నారు. మంత్రుల పేషీలో 20 మంది ఉన్నారు.. తమ వాళ్ళను పెట్టుకుంటున్నారు.ప్రజాధనం వృధా అవుతుంది. ఒక్కో ఐఏఎస్ కు 8 డిపార్ట్ మెంట్ లు ఇస్తున్నారు. ఐఏఎస్ లు బదిలీ అయితే అయన తో పని చేసిన వారిని తీసుకొని పోతున్నారు. ఆంధ్ర కేడర్ కు చెందిన అధికారులను అడ్వైజర్ లుగా పెట్టుకున్నాడు సిఎం అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ఏపీ ప్రజలకు గుడ్ న్యూస్.వాటి కోసం 2,300 ప్రత్యేక కౌంటర్లు



బియ్యం, కందిపప్పు పంపిణీ కోసం 2,300 ప్రత్యేక కౌంటర్లు చేసినట్లు ప్రకటించారు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌరసరాఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌరసరాఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా విలువలతో కూడిన రాజకీయాలు చేస్తామని ప్రకటించారు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌరసరాఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషిని అందరూ గుర్తించాలని కోరారు. గత వైకాపా ప్రభుత్వంలో సివిల్ సప్లైస్ అద్వానంగా తయారయిందని ఫైర్ అయ్యారు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌరసరాఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే రేషన్ దారి మల్లెతే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా 2,300 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశాం. ప్రజల కోసం అతి తక్కువ ధరలకు , బియ్యం మరియు కందిపప్పు ఈ సెంటర్ల లో అందుబాటు లో ఉంటాయని తెలిపారు.

## వైసీపీ నేత తల్లి చనిపోతే దినం చేయడానికి కూడా అనుమతి ఇవ్వలేదు




వైసీపీ నేతలపై కూటమి ప్రభుత్వంలో దాడులు ఎక్కువయ్యాయని.. వైసీపీ జెండా మోసిన వారిని టార్గెట్ చేశారని వైసీపీ నేత పేర్ని నాని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో జైళ్లను నింపే కార్యక్రమం కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. చంద్రబాబు సమావేశాల్లో అమరావతి, అభివృద్ధి, సంపద సృష్టి అని కబుర్లు చెబుతున్నారని.. కానీ తెరవెనుక జరిగేదంతా మట్టి, ఇసుక దోపిడీ, లే అవుట్ల పేరుతో దోపిడీనే అని ధ్వజమెత్తారు పేర్ని నాని. 2023 ఫిబ్రవరిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై టీడీపీ కార్యకర్తలు దాడికి దిగారు.. టీడీపీ కార్యకర్తలపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తిరగబడితే ఇప్పుడు తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు పేర్ని నాని. గన్నవరం వైఎస్సార్‌సీపీలో యాక్టివ్‌గా ఉన్నవారిని అరెస్టు చేస్తున్నారు. పోలీసులను అడ్డగోలుగా దిగజార్చి వాడుకుంటున్నారు. బెయిల్ రాకుండా చేయడానికి సెక్షన్లు మార్చి జైళ్లలో ఉంచుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడి తల్లి చనిపోతే దినం చేయడానికి కూడా అనుమతి ఇవ్వలేదన్నారు. నూజివీడు సబ్ జైల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పేర్నినానితోపాటు, మాజీ ఎమ్మెల్యేలు కైలే అనిల్ కుమార్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం పరామర్శించారు.

## దానం టీషర్ట్, పౌడర్ వేసుకుని వెళ్లి చేసే వేశాలు మాకు తెలుసు



ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలపై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. దానం నాగేందర్ నేను హైదరాబాద్‌లోనే ఉన్నా. నువ్వు మొగోడివైతే రా చూసుకుందాం. ఎక్కడో స్పాట్ చెప్పు రావడానికి నేను రెడీ.. అంటూ సవాల్ విసిరారు. దానం నాగేందర్ మాటలు దారుణంగా ఉన్నాయని, సభలో రూల్స్‌కి వ్యతిరేకంగా ఆయన స్థానం నుంచి కాకుండా వేరే సీటు నుంచి మాట్లాడారని పాడి కౌశిక్ తెలిపారు. దానం నాగేందర్ నువ్వు తాజ్ క్రిష్ణ హెటల్‌కు టీషర్ట్, పౌడర్ వేసుకుని వెళ్లి చేసే వేశాలు మాకు తెలుసని కౌశిక్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. దానం నోరు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని.. ఎవరూ భయపడటం లేదన్నారు. కేసీఆర్ పెట్టిన బిక్షపై నువ్వు ఎమ్మెల్యే అయ్యావు.. దమ్ముంటే నువ్వు రాజీనామా చేసి మళ్ళీ గెలువాలని సవాల్ విసిరారు పాడి కౌశిక్. గతంలో ఇలాగే మాట్లాడితే ఉప్పల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఎల్బీనగర్‌లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిలు ఉరికించి కొట్టిన సంగతి మరచిపోవద్దన్నారు.

## శిలాఫలకం పై బీజేపీ ఎమ్మెల్సీ పేరు మాయం..
## ఎమ్మెల్యే పై డీకే అరుణ సీరియస్



సాధారణంగా ఒక ప్రభుత్వ కార్యక్రమం ఏదైనా జరుగుతుందంటే ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రోటోకాల్ ఆధారంగా శిలాఫలకాన్ని తయారు చేస్తుంటారు. ఆ శిలా ఫలకాల్లో కొంత మంది పేర్లు మిస్ అవుతుంటాయి. కొంత మంది కావాలని మిస్ చేస్తే.. మరికొందరూ మాత్రం చిన్న చిన్న పొరపాట్ల కారణంగా శిలాఫలకం పై పేర్లు మిస్ అవుతుంటాయి. తాజాగా నారాయణపేట జిల్లాలో ఇలాంటి ఘటననే చోటు చేసుకుంది. నారాయణపేట జిల్లా మక్తల్ లో ప్రోటోకాల్ వివాదం తలెత్తింది. నర్వ ప్రాథమిక వ్యవసాయ సంఘం కార్యక్రమంలో శనివారం ఈ రగడ జరిగింది. శిలా ఫలకం లో బీజేపీ ఎమ్మెల్యే ఏవీఎన్ రెడ్డి పేరు లేకపోవడంతో స్థానిక ఎంపీ డీ.కే.అరుణ సీరియస్ అయ్యారు. ఈ విషయం ఎమ్మెల్యే శ్రీహరిని ఎంపీ డీ.కే.అరుణ నిలదీశారు. దీంతో పరస్పరం బీజేపీ, కాంగ్రెస్ వర్గీయుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

# జనగణన ఎందుకు లేదు



2021లో జరగాల్సిన దశాబ్ది జనాభా లెక్కల కార్యక్రమం ఇంతవరకూ జరగలేదు. 2024-25 కేంద్ర బడ్జెట్‌లో జనాభా లెక్కల సేకరణకు అవసరమైన సమగ్ర కేటాయింపులేమీ లేవు. జిల్లా, తాలూకా, సమితి, గ్రామం వంటి పాలనా హద్దులను యథాతథంగా వుంచడం జనాభా లెక్కలకు అవసరం. కానీ 2024 జూన్ నాటికి వున్న పాలనా సరిహద్దులను మార్చడానికి వీలు లేకుండా స్తంభింపజేసే ఉత్తర్వులను పొడగించుతూ కేంద్రం ఎలాంటి పొడగింపూ ప్రకటించలేదు. కనుక 2020లో ప్రారంభమై వుండాల్సిన 2021 జనాభా లెక్కలు నిరవధికంగా జాప్యం అవుతున్నాయి. కోవిడ్ ముగిసిన తర్వాతనే జనాభా లెక్కల కార్యక్రమం నిర్వహించడం సాధ్యమని ఆ తరుణంలో ప్రభుత్వం చెప్పింది. కాని ఆ తర్వాత మూడేళ్లు గడిచినా 2024లో కూడా జనాభా లెక్కలు సేకరించే సూచనలేవీ కనిపించడం లేదు. కోవిడ్ తర్వాత జనాభా లెక్కల సేకరణ జరగని నాలుగే దేశాల్లో భారత దేశం కూడా చేరుతున్నది.

### బ్రిటిష్ కాలం నుంచి దిక్కూచిగా

బ్రిటిష్ పాలనా కాలం నుంచి కూడా ప్రతి పదేళ్లకోసారి జనాభా లెక్కల సేకరణ క్రమం తప్పకుండా జరుగుతూ వస్తున్నది. 1941లో రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో కూడా అరకొరగానైనా జనాభా లెక్కల సేకరణ జరిగింది. ఎందుకంటే ఈ లెక్కల వల్ల కేవలం జనాభా ఎంత వున్నారనే విషయం మాత్రమే గాక గృహాలవారీ సమగ్ర సమాచార డేటా చేతికి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోనైతే సాగుదార్లు, వ్యవసాయ కార్మికుల వివరాలు తెలుస్తాయి. గ్రామీణ పట్టణ జనాభా ఎలా వుంది? భాష మాట్లాడే జనాభా ఎంతమంది వున్నారు? షెడ్యూలు కులాలు తెగల జనాభా ఎంత వుంది? వంటి అంశాల గురించిన ఒక చిత్రం ఆవిష్కరించబడుతుంది. ఈ సమాచార సంపద ఆధారంగానే అన్ని స్థాయిల్లోని విధాన నిర్ణేతలు, పరిపాలకులు తమ విధానాలను రూపొందించుకోవడం వాటిని వివిధ తరగతులవారికి అనువర్తింపచేయడం జరుగుతుంది. ఉదాహరణకు జాతీయ ఆహార భద్రతా చట్టం గ్రామీణ జనాభాలో 75 శాతానికి పట్టణ జనాభాలో 50 మందికి ఈ చట్టాన్ని వర్తింపచేయాలని చెబుతున్నది. అంతేకాకుండా జనాభా లెక్కల అంచనాల ఆధారంగా ప్రకటించిన వివరాలను బట్టి కేటాయింపులు చేయాలని చెబుతున్నది. 2021 లెక్కలను తీసుకుని ఈ చట్టం కింద 81.5 కోట్ల మందికి వర్తింపజేశారు. 2024 మార్చి నాటికి సంబంధించి వేసిన ముందస్తు అంచనా ప్రకారమైతే 93 కోట్ల మందికి దీన్ని అమలు చేయాల్సి వుంటుంది. అలా జరక్కపోవడమంటే 11 కోట్ల మంది అర్హులైన వారిని సబ్సిడీ లేదా ఉచిత ధాన్యాలు అందకుండా దూరం చేస్తున్నారని అర్థం.

### జరగకపోతే నష్టాలెన్నో!

పార్లమెంటులో, శాసనసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ జనాభా లెక్కల తర్వాతే ఆ పని జరగాలని నిర్దేశించింది. నియోజక వర్గాల పునర్విభజన ఆ తర్వాతే జరుగుతుంది. ఇప్పుడు జనాభా లెక్కలు తీయకపోవడమంటే మహిళల రిజర్వేషన్‌ను దూరానికి నెట్టివేసినట్టే. కనీసం 2029లోనైతే ఈ పని జరగకపోవచ్చు. జనగణన లేకపోవడం వల్ల కలిగే మరో ప్రభావం ఏమంటే పట్టణీకరణ జరిగిన అనేక గ్రామాలు చట్టబద్ధంగా పట్టణ హెూదా పొందలేకపోతాయి. దాంతోపాటు వాటికి వచ్చే పురపాలనా వ్యవస్థల సదుపాయాలు అందబోవు. జనాభా లెక్కలు తీయకపోవడం వల్ల కలిగే మరో హానికర పర్యవసానం ఏమంటే పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల హద్దుల పునర్విభజన జరగడానికి వుండదు. ప్రజాస్వామ్యంలో నియోజకవర్గాల హద్దుల నిర్ణయం ఎలా వుండాలంటే ప్రతి వ్యక్తి ఓటుకూ సమ తూకం వుండాలి.

### ఎందుకీ ఉపేక్ష

మరి అలాంటప్పుడు ప్రభుత్వం జనాభా లెక్కల కోసం ఉత్తర్వు ఇవ్వాలనే ఉత్సుకత ఎందుకు ప్రదర్శించడం లేదు? గత కొన్నేళ్లలో శాస్త్రీయ ప్రాతిపదికన నిర్వహించిన సంఖ్యాపరమైన సర్వేల పట్ల ఒక సాధారణ తృణీకార భావన వుండటం ఒక కారణమై వుండొచ్చు. అనేక సర్వేలను తొక్కిపెట్టడం, సర్వేల తప్పుగా మార్చడంకోసం గణాంక కొలబద్దలను మార్చడం జరిగింది. రాజకీయాలలోనూ విధానాల రూపకల్పనలోనూ అసంబద్ధతను ప్రోత్సహించేందుకు బిజెపి, ఆరెస్సెస్‌లు ప్రయోగిస్తున్న పాచిక ఇది. దీనికి ప్రేరణ హిందూత్వ భావజాలమే. ఉదాహరణకు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ 2041 జనాభా లెక్కల నాటికి ముస్లిముల తాకిడితో హిందువులు అయిపు లేకుండా పోతారని పదేపదే చెబుతున్నారు. అలాంటి అహేతుక వాదనలతోనే అస్సాంలో ముస్లిం వ్యతిరేక చట్టాలు తేవడం, చర్యలు తీసుకోవడం జరుగుతున్నది.

### సన్నాహాలకు శ్రీకారం

కనుక బిజెపి హిందూత్వ శక్తుల అశాస్త్రీయ దృక్పథానికి జనాభా లెక్కలు సమిధలవుతున్నాయి. అందువల్ల విధానాల నిర్ణయం శాస్త్రీయ సమాచారం ఆధారంగా జరగాలన్నా, సమాజంలోని పీడిత వర్గాలన్నిటికీ న్యాయం లభించేలా భరోసా కల్పించాలన్నా ఇప్పటికే ఎంతో ఆలస్యమైన 2021 జనాభా లెక్కలు పై ఏడాదిలోనే జరగాలని గట్టిగా కోరాలి. అందుకోసం సన్నాహక కృషి ఈ ఏడాదే ప్రారంభం కావాలి. అన్ని ప్రజాస్వామిక తరగతులు, ప్రతిపక్షాలు ముక్త కంఠంతో అదే కోరాలి.

# యువతను చిత్తు చేస్తున్న 'మత్తు'



యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (యుఎన్ఒడిసి)-2021 నివేదిక ప్రకారం 2019లో 27.5 కోట్ల మంది మాదకద్రవ్యాలను ఉపయోగించారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మాదకద్రవ్యాల వినియోగం మరింత వేగంగా పెరుగుతున్నది. గంజాయి అత్యంత విస్తృతంగా వినియోగించే డ్రగ్ అని నేషనల్ క్రైమ్ బ్యూరో (ఎన్‌సిబి) సర్వేలు చెబుతున్నాయి. ఎన్నికల ముందు విశాఖపట్నం పోర్టులో సుమారు రూ.50 వేల కోట్ల విలువ చేసే 25 వేల కిలోల డ్రగ్స్ కంటైనర్ పట్టుబడింది. ఈ మాదకద్రవ్యాల కంటైనర్ వెనుక వున్నది మీరంటే మీరని అధికార ప్రతిపక్షాలు నాడు ఒకరి మీద ఒకరు విరుచుకు పడ్డాయి. ఈ కంటైనర్ బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలైన పురంధేశ్వరి బంధువులకు సంబంధించిన కంపెనీ నుండి ఆర్డర్ చేయబడిందని ఆరోపణలు వచ్చాయి. ఇంత జరిగిన తరువాత ఎన్నికల అనంతరం దీని గురించి ఎవరూ ప్రస్తావించడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి అక్రమ రవాణా విచ్చలవిడిగా పెరుగుతుందని సర్వేలే చెబుతున్నాయి. ఎన్‌సిబి నివేదిక ప్రకారం ఒక సంవత్సరంలో పట్టుబడ్డ మొత్తం గంజాయి 7,49,761 కేజీలు కాగా ఆంధ్రప్రదేశ్‌లో పట్టుబడ్డది 2,00,888 కేజీలు. అంటే మొత్తం గంజాయిలో 26 శాతం ఆంధ్రప్రదేశ్ లోనే పట్టుబడింది. అంటే దానర్థం ఎక్కువ గంజాయి అక్రమ రవాణా మన రాష్ట్రంలో జరుగుతుందనేది వాస్తవం. ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా సరిహద్దు ప్రాంతంలో ఎక్కువగా గంజాయి సాగు జరుగుతుంది. ఎందుకంటే అక్కడ ఉన్న అటవీ ప్రాంతం ఈ సాగుకు భౌగోళికంగా సహకరస్తుంది. స్థానిక ప్రజాప్రతినిధుల, ప్రభుత్వ అండదండలు లేకుండా గంజాయి సాగు చెయ్యడం, అక్రమ రవాణా సాధ్యం కాదు. గంజాయి సాగుతోబాటుగా వినియోగించే వారి సంఖ్య (ముఖ్యంగా 16 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్కుల సంఖ్య) పెరుగుతున్నది. చాలా చోట్ల స్కూల్ పిల్లల చేతుల్లోకి కూడా గంజాయి వచ్చి చేరుతున్నదంటే ఈ మహమ్మారి ఎంతలా విస్తరించిందో అర్థం అవుతుంది. ఈ మాదకద్రవ్యాల పంపిణీలో సోషల్ మీడియా నేడు కీలక పాత్ర పోషిస్తున్నది. సోషల్ మీడియా ద్వారా డ్రగ్స్ వినియేగించేవారు కేవలం సరుకు కొనేవారిగానే కాక దాన్ని విస్తరించేవారిగా కూడా ఉంటారు. నూతన ఆర్థిక ఆవిష్కరణలు, మొబైల్ చెల్లింపులు, డిజిటల్ కరెన్సీ వంటి సాంకేతిక పరిజ్ఞానం ఈ విస్తరణకు తోడైంది. మారు మూల ప్రాంతాలకు కూడా జొమోటాలో ఫుడ్ మాదిరిగా గంజాయి, కొకైన్ వంటి మాదకద్రవ్యాలను మన చేతుల్లోకి తెచ్చి చేరుస్తున్నది. సాధారణంగా ఏ వ్యాపారస్తుడైనా ఒక సరుకును అమ్మాలనుకుంటున్నప్పుడు మొట్టమొదట ఆ సరుకుని అందరికీ అలవాటు చేస్తాడు. ఈస్టిండియా కంపెనీ వాడు టీ అమ్మడం కోసం మొదట భారత దేశ ప్రజలకు టీ అలవాటు చేశాడు. అంబానీ జియో అలవాటు చేశాడు. మిగిలిన నెట్‌వర్క్‌లు అన్నీ కుదేలైపోయి నేడు దేశంలో ఎక్కువ మంది దాన్నే వాడుతున్నారు. అలాగే డ్రగ్ యజమానులు ప్రభుత్వ అండదండలతో డ్రగ్స్‌ని విచ్చలవిడిగా విస్తరింపజేస్తున్నారు. చివరికి అది ఒక వ్యసనంగా మారుతున్నది. కార్పోరేట్ విద్య, పెరుగుతున్న నిరుద్యోగం, ప్రతి అనుభూతిని ఆస్వాదించాలనే కుతూహలం విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిసవడానికి దోహదపడుతున్నాయి. కార్పోరేట్ విద్యా సంస్థల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు విరామం లేకుండా అనేక రకాల కోచింగ్‌ల పేరుతో చదివించడంతో విద్యార్థులు ఒత్తిడికి గురయ్యి దాని నుండి బయట పడటానికి గంజాయి తీసుకోవడం, సిగిరెట్లు ఎక్కువగా తాగడం చేస్తున్నారు. ఇలా ప్రతి రోజూ చెయ్యడంతో అది వ్యసనంగా మారుతున్నది. ఇంజనీరింగ్ విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పబ్ కల్చర్‌కు అలవాటు పడుతూ గంజాయి తీసుకుంటున్నారు. లక్షలు ఖర్చు పెట్టి చదివిన తరువాత ఉద్యోగాలు లేక నిరుద్యోగం పెరిగిపోవడంతో ఒకవైపు తల్లిదండ్రుల నుండి మరోవైపు సమాజం నుండి ఎదురవుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక డ్రగ్స్‌కు అలవాటు పడ్డవారు దీనిని రెండు రకాలుగా వినియోగిస్తున్నారు. ఒకటి-తను వినియోగించుకోవడానికి. రెండు-డబ్బులు సంపాదించడానికి. ఎక్కువ మంది నిరుద్యోగులు ఈ మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భాగస్వామ్యం అవుతూ పెడదారి పడుతున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను వ్యవస్థీకృతం చెయ్యడం వలన హింస పెరుగుతున్నది. రాష్ట్రంలో జరిగిన అధిక నేరాలు, హత్యలు డ్రగ్స్ మత్తులో ఉన్నప్పుడు చేసినవే. మత్తు పదార్థాలకు అలవాటు పడ్డవారు సరైన సమయంలో డబ్బులు లేకపోవడంతో దొంగతనాలకు, హత్యలకు పాల్పడుతున్న ఘటనలున్నాయి. దీన్ని అరికట్టాల్సిన ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే మద్యం లేకుండా చేస్తామని చెప్పి నేడు మద్యాన్ని ఏరులై పారిస్తున్నది. దాన్ని రాజకీయ, ఆర్థిక అవసరాలకు ఉపయోగించుకుంటున్నది. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పెంచిపోషిస్తుంది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా అనేది రాజకీయ, ఆర్థిక, సామాజిక, భద్రత ఇలా అన్నింటితో ముడిపడి ఉంటుంది. కాబట్టి దీన్ని అరికట్టాలంటే మాదకద్రవ్యాలకు సంబంధించిన సాగు, ఉత్పత్తి, తయారీ, రవాణా, పంపిణీ, అమ్మకం ఇలా అన్ని దశలను పరిష్కరించాలి. పోర్టులు, రైల్వేలు, ఎయిర్‌లైన్స్ వంటి రవాణా వ్యవస్థలన్నీ ప్రైవేటీకరణ చేయడం వలన ఇది మరింత కష్టం అవుతుంది. దీనికి ఉన్న ఏకైక మార్గం ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం. లేకుంటే రాష్ట్రంలో ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు, యువకుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుంది.

# 'మినిమమ్' బ్యాలెన్స్..!




కనీస నిల్వలు పాటించని సేవింగ్స్ అకౌంట్ ఖాతాదారుల నుండి బ్యాంక్‌లు జరిమానా పేరుతో భారీగా సొమ్ము వసూలు చేయడం దారుణం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మినహా పదకొండు ప్రభుత్వ రంగ బ్యాంకులు 2023-24 ఆర్థిక సంవత్సరంలో పొదుపు ఖాతాల్లో కనీస నిల్వను నిర్వహించడంలో విఫలమైనందుకు ఖాతాదారుల నుండి రూ.2,331 కోట్లు వసూలు చేశాయని కేంద్ర ఆర్థిక శాఖ పార్లమెంటుకు నివేదించింది. అంతకు ముందు ఏడాది అంటే 2022-23లో రూ. 1,855 కోట్లు పిండుకోగా ఇప్పుడు 25.63 శాతం అదనంగా ఈ బ్యాంకులు గుంజుకున్నాయన్నమాట. గత మూడేళ్లలో కనీస నిల్వను నిర్వహించనందుకు ఖాతాదారుల నుండి రూ.5,614 కోట్లు వసూలు చేశాయి. ఈ విధంగా ఖాతాదారుల నుండి జరిమానా పేరిట డబ్బు అప్పనంగా కొట్టేయడం బ్యాంకులకు తగని పని. కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలను ఉదారంగా మాఫీ చేస్తున్న బ్యాంకులు సామాన్యుల నుండి ఇలా గోళ్లూడగొట్టి వసూలు చేయడం అమానుషం. బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ మాత్రం 2019-20 నుంచి కనీస బ్యాలెన్స్ మెయింటెయిన్ చేయని ఖాతాదారులపై జరిమానా విధించడాన్ని నిలిపివేయడం కొంత ఊరట కలిగించే విషయం. ప్రభుత్వ రంగ బ్యాంకుల సంగతిలా వుంటే రకరకాల రూపాల్లో జనం సొమ్ము కొల్లగొట్టే ప్రయివేటు బ్యాంకులు తమ ఖాతాల్లో కనీస నిల్వలు ఉంచడంలో విఫలమైతే ఖాతాదారుల నుంచి భారీ మొత్తాలను వసూలు చేస్తున్నాయి. ఆ విధంగా బ్యాంకులు సేవింగ్స్ ఖాతాదారుల నుండి ఈ రూపంలో సొమ్ము లూటీ చేయడం అమానుషం. బ్యాంకుల్లో సేవింగ్స్ ఖాతా తెరిచేది పేదలు, సామాన్య మధ్యతరగతి వారేనని వేరుగా చెప్పనక్కరలేదు. అంతే కాదు! వివిధ రకాల ప్రభుత్వ పథకాలకు, రాయితీలు పొందడానికీ బ్యాంకు ఖాతా తప్పనిసరి అంటూ జనం చేత వాటిని తెరిపించేది ప్రభుత్వ అధికారులు లేదా వాటి ప్రమోటర్లే కదా! నరేంద్ర మోడీ తొలిసారి ప్రధాని అయిన సందర్భంలో విదేశాల్లోని నల్లధనాన్ని ప్రజల ఖాతాలో వేస్తామని సాగించిన భారీ ప్రచారాన్ని ఒక్కసారి గుర్తు చేసుకుంటే ఈ పాపంలో పాలకుల పాత్ర ఎంతుందో విదితమవుతుంది. ఆనాటి జన్‌ధన్ ఖాతాల హడావుడి కూడా ఎవరూ మర్చిపోలేరు. ఒకవైపున సర్కారువారే ఖాతాలు తెరిపించి వాటికి అనుసంధానంగా ఇన్సూరెన్స్ కూడా జత చేసి ఆ ప్రీమియంను ఖాతాదారుల నుండి వసూలు చేసిన విషయం చాలా మందికి అసలు తెలియనే తెలియదు. ఈ రూపంలో ఏటా ప్రీమియం కత్తిరింపు జరిగి కనీస నిల్వ తరిగిపోయిన ఖాతాదారులు కోకొల్లలు. ఇది కూడా బ్యాంకులు చేస్తున్న మరోవిధమైన లూటీయే కదా! పొదుపు ఖాతా నిర్వహణకు ఆ యా బ్యాంకులకు ఓవర్‌హెడ్స్ రూపంలో కొంత ఖర్చుయ్యేమాట నిజమేకానీ వారు జరిమానా పేరిట గుంజుతున్నంత మొత్తమైతే అవ్వదన్నది నిర్వివాదాంశం. అన్నిటి ధరలు విపరీతంగా పెరిగిపోతుండగా మరోవైపున ప్రజల ఆదాయాలు తరిగిపోతున్నాయని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. ధరలు, నిరుద్యోగం అన్న రెండు ప్రధానాంశాలే ఇటీవలి సాధారణ ఎన్నికల్లో ప్రభావితం చేశాయని పలు సర్వేలు నిగ్గు తేల్చాయి. ఇటువంటి నేపథ్యంలో ప్రజలు బ్యాంకుల్లో పొదుపు చేయడం అనేది ఓ మిలియన్ డాలర్ల ప్రశ్న లాంటిది. ఏడాదికేడాది ప్రజల పొదుపు తరిగిపోతున్నదని కేంద్ర గణాంకాల సంస్థ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రతికూల పరిస్థితుల్లో ప్రజల్లో పొదుపు పట్ల అవగాహన కలిగించి, ఆసక్తి పెంచడం బ్యాంకులు, అంతకు మించి ప్రభుత్వమూ చేపట్టవలసి వుంది. ఆ పని మానేసి కనీస ఖాతా నిల్వ లేదనో ఇంకో పేరుతోనో ప్రజలపై భారాలు వేస్తూ పోతే అసలు బ్యాంకు గడపనెక్కడానికే జనం భయపడే స్థితి దాపురించే ప్రమాదముంది. 2008లో ప్రపంచాన్ని చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం భారతదేశాన్ని అంతలా దెబ్బ తీయకపోవడానికి మన బ్యాంకింగ్ రంగమూ, ద్రవ్య నిర్వహణా వ్యవస్థల పటిష్టత ఒక ముఖ్య కారణమని విశ్లేషకులు నిర్ధారించారు. మన బ్యాంకింగ్ వ్యవస్థను మరింతగా పటిష్టపరుచుకోవాలి. ఇంకా ఎక్కువ మందిని వాటి పరిధిలోకి తేవడం ఎంతో అవసరం. ప్రజల్లో పొదుపు పట్ల ఆసక్తి పెంచేందుకు తగు ప్రోత్సాహకాలివ్వాలి తప్ప బ్యాంకులు రకరకాల పేర్లతో జరిమానాలు విధించడం ఇప్పటికైనా మానుకోవాలి.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, # /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15,NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.).
Cell:9398156948,REG.RNI:APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com